# కరోనా వైరస్ మరియు క్రీస్తు

జాన్ పైపర్

# కరోనా వైరస్
## మరియు
# క్రీస్తు

# Other books by John Piper

*The Dangerous Duty of Delight*

*Desiring God*

*Don't Waste Your Life*

*Fifty Reasons Why Jesus Came to Die*

*God is the Gospel*

*A Hunger for God*

*Let the Nations Be Glad!*

*The Pleasures of God*

*Reading the Bible Supernaturally*

*Seeing and Savoring Jesus Christ*

*Spectacular Sins*

*A Sweet and Bitter Providence*

*What Jesus Demands from the World*

*When I Don't Desire God*

*Why I Love the Apostle Paul*

# కరోనా వైరస్
# మరియు
# క్రీస్తు

రచన

## జాన్ పైపర్

అనువాదం

*నగేష్ సిర్రా*

ప్రచురణ

ekklesia books
Bible-centered Resources for Local Churches

*Coronavirus and Christ*

Copyright © 2020 by Desiring God Foundation

Originally published by Crossway, 1300 Cresent Street, Wheaton, Illionois 60187

This edition is published by arrangement with Crossway Books for print in India and not for export therefrom.

ఈ పుస్తకం యొక్క మొదటి అనువాదంలో సహాయం చేసినందుకు తిమోతి బొక్కా గారికి ధన్యవాదాలు.

ప్రచురణకర్తల నుండి వ్రాతపూర్వకమైన అనుమతి తీసుకోకుండా, ఈ పుస్తకములోని ఏ భాగమును పునరుత్పత్తి చేయడంగాని, ఏ రూపంలోగాని, ఏ సాధనాల ద్వారాను ఉపయోగించుకొనడంగాని, ఎలక్ట్రానికల్ పద్దతిలో గాని, యాంత్రిక పద్దతిలో గాని, జిరాక్స్ తీయడం గాని, ముద్రించడం గాని, సమాచార సేకరణ, లేక వెలిబుచ్చే పరికరములో సమకూర్చడం గాని చేయరాదు.

**ప్రచురణ చిరునామా:**

**ఎక్లేషియ బుక్స్**

రాజ్యలక్ష్మి కాంప్లెక్స్, చందానగర్, హైదరాబాద్ 500050, తెలంగాణ
ఫోన్ నెంబర్లు: 9381128118, 9821683064, 9581829219

వెబ్‌సైట్: www.ekklesiabooks.com

ఈమెయిల్: ekklesiabooks@gmail.com

ముద్రణ, 2020

# విషయసూచిక

సందర్భం: కరోనా వైరస్ ........................................ 8

## భాగం 1: కరోనా వైరస్‌ను పరిపాలిస్తున్న దేవుడు

1. బండను సమీపించండి ........................................ 12

2. స్థిరమైన పునాది ........................................ 23

3. మనకు బండయైనవాడు నీతిమంతుడు .................. 32

4. సమస్తముపై సార్వభౌముడు .................................. 41

5. ఆయన పాలనలోని మాధుర్యం ............................ 50

## భాగం 2: కరోనా వైరస్ ద్వారా దేవుడేం చేస్తున్నాడు?

చూడడం, చూపించడం గురించిన తొలి తలంపులు...... 60

6. నైతిక భీతిని చిత్రిస్తున్నాడు........................................ 66

7. కొన్ని ప్రత్యేకమైన దైవ తీర్పులను పంపిస్తున్నాడు.... 74

8. రెండవ రాకడ కోసం మనల్ని
మేల్కొలుపుతున్నాడు ........................................ 78

9. క్రీస్తు యొక్క అనంతమైన విలువకు
అనుగుణంగా మనల్ని మలుస్తున్నాడు .................. 89

10. అపాయంలోనూ సత్క్రియలను సృష్టిస్తున్నాడు........... 96

11. ప్రజలను సువార్తతో చేరుకోవడానికి
క్రైస్తవులను పురికొల్పుతున్నాడు ............................ 106

ముగింపు ప్రార్థన ................................................ 110

నోట్సు ........................................................... 112

లేఖన సూచిక ................................................... 113

Desiring God ................................................ 118

# సందర్భం:
# కరోనా వైరస్

ప్రపంచమంతటా కరోనా మహమ్మారి విస్తరించిన 2020 వ సంవత్సరం మార్చి నెల చివరి రోజుల్లో నేను ఈ చిన్న పుస్తకాన్ని రాస్తున్నాను. కరోనా వైరస్ సోకడం మూలంగా కలిగిన వ్యాధిని "కరోనా వైరస్ డిసీజ్ 2019" అని, సంక్షిప్తంగా **"కోవిడ్ 19"** అని పేర్కొనడం జరిగింది. ఈ వైరస్ ఊపిరితిత్తులను దెబ్బ తీస్తుంది. వ్యాధి ముదిరిన సందర్భాల్లో ఊపిరాడక రోగి మరణిస్తాడు.

2020, జనవరి 11వ తేదీన చైనాలో ఈ వైరస్ మూలంగా తొలి మరణం నమోదయింది. నేను ఈ పుస్తకం రాస్తున్న సమయానికి లక్షలాది మందికి ఈ వైరస్ సోకింది. వేలాదిమంది చనిపోయారు. ఇంతవరకూ దీనికి చికిత్స అందుబాటులోకి రాలేదు.

మీరు ఈ పుస్తకం చదివేనాటికి అప్పటి పరిస్థితులు ఎలా ఉండబోతున్నాయో నాకంటే మీకే ఎక్కువగా తెలుస్తుంది. ఇందువల్ల ఈ వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి కానీ ఆర్థిక నష్టం భర్తీ చేయడం గురించి గానీ నేను సలహాలు, సూచనలు అందించాల్సిన అవసరం లేదు. సామాజిక బంధాలు, ప్రయాణాలు, సమావేశాలు, సంఘ కూడికలు, థియేటర్లు, రెస్టారెంట్లు, క్రీడా కార్యక్రమాలు, వ్యాపారాలు స్తంభించిపోయాయి.

ప్రపంచవ్యాప్తంగానూ, అమెరికాలోనూ ఇది ఇంతకు ముందెన్నడూ జరగనిది కాదు. The Centres for Disease Control గణాంకాల ప్రకారం 1918 లో ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన విషజ్వరం (Influenza Epidemic) మూలంగా ఐదు కోట్లమంది మరణించారు.[1] ఈ ఐదు కోట్లమందిలో ఐదు లక్షలమంది అమెరికా సంయుక్త రాష్ట్రాల వాళ్ళే ఉన్నారు. ప్రజల్లో ఉదయకాలాన రోగ లక్షణాలు కనబడేవి. సాయంత్రం వేళకు చనిపోయేవాళ్ళు. మృతదేహాలను ఇళ్ల వాకిళ్ళ నుండి తీసుకెళ్ళి బుల్డోజర్లతో తవ్వబడిన గుంతల్లో పూడ్చిపెట్టేవాళ్ళు. మాస్క్ ధరించని వాళ్ళను తుపాకీతో కాల్చి చంపేవాళ్ళు. పాఠశాలలన్నీ మూతపడ్డాయి. హర్‌మెగిద్దోను యుద్ధమే (అంతిమ పోరు) జరుగుతోందని సేవకులు ప్రకటించారు.

గత కాల సంభవాలు దేనినీ నిరూపించవు. గతం ఒక హెచ్చరికే గాని విధిరాత కాదు. అయితే లోకం ఎంత బలహీనమైనదో గుర్తించిన సమయం ఇది. బలమైన పునాదులుగా కనబడేవన్నీ వణుకుతున్నాయి. ఈ సందర్భంలో మనం అడగాల్సిన ప్రశ్న: మన కాళ్ళ కింద ఉన్నది ఎన్నడూ కదిలించబడని బండా? కాదా?

# భాగం 1:

# కరోనా వైరస్‌ను పరిపాలిస్తున్న దేవుడు

# అధ్యాయం 1

# బండను సమీపించండి

పరిస్థితుల్నీ, అవకాశాల్నీ నమ్ముకోవడం వ్యర్థం కాబట్టి నేను ఈ పుస్తకాన్ని రాయడానికి ప్రేరణ పొందాను. "రోగం బారినవడిన 10 శాతంలో 3 శాతం మందే చనిపోతున్నారు. యువకులకు ఏమీ కావడం లేదు. వృద్ధులకే ప్రమాదం. అనారోగ్య చరిత్ర ఉన్నవాళ్ళ కంటే ఏ వ్యాధులూ లేనివాళ్ళు సురక్షితం. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారి కంటే పట్టణ వాసులకు వైరస్ సోకే అవకాశాలు ఎక్కువ. స్వీయ నిర్బంధంలో ఉన్నవాళ్ళే స్నేహితులతో గృహాల్లో సమావేశమయ్యే వాళ్ళకంటే క్షేమంగా ఉంటారు" అనే మాటలు ఏమాత్రమూ నిరీక్షణను కలిగించవు. మనం నిలబడడానికి స్థిరమైన ప్రదేశం కాదది.

ఇంతకన్నా శ్రేష్ఠమైన మార్గం ఉంది. "బహుశా ఇలా జరగ వచ్చేమో" అనే ఇసుకలాంటి ఆలోచనపై కంటే "ఖచ్చితంగా ఇలానే జరుగుతుంది" అనే బండలాంటి ఆలోచనలపై నిలబడడమే ఉత్తమం.

## క్యాన్సర్ బారిన పడినప్పుడు

"మీకు ప్రోస్టేట్ (మూత్రాశయాన్ని ఆవరించి ఉండే గ్రంధి) క్యాన్సర్ ఉంది" అని 2005 డిసెంబర్ 25వ తేదీన డాక్టర్ నాకు చెప్పిన సంగతి జ్ఞాపకం వస్తోంది. ఆ తర్వాత కొన్ని వారాలపాటు

పరిస్థితులు ఎలా ఉండబోతున్నాయి అనే దాని గురించే సంభాషణ జరిగింది. “మందులు సరిపోతాయా? హోమియోపతి వైద్యం పనిచేస్తుందా? పెద్ద ఆపరేషన్ చేయించు కోవాలా? ఏ పద్ధతి ఎంత శాతం పనిచేస్తుంది?” అనే విషయాల గురించి సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. నా భార్య నోయల్, నేను వీటి గురించి తీవ్రంగానే పరిశీలించాము. అయితే సాయంత్ర సమయంలో మేమిద్దరం ఒకరిని ఒకరం చూసుకుని చిరునవ్వు నవ్వుకుని, “మా నిరీక్షణ వైద్య పద్ధతుల్లో లేదు, కానీ దేవునిలోనే ఉంది” అని అనుకున్నాం.

“వైద్యులు ఏ పద్ధతిని ఎన్నుకున్నా దేవుడు నన్ను నూటికి నూరు శాతం స్వస్థపరుస్తాడు” అని మా ఉద్దేశం కాదు. మేము ఏ బండ గురించైతే మాట్లాడుతున్నామో అదే స్వస్థత కంటే ఎంతో శ్రేష్ఠమైనది.

డాక్టర్‌గారు ఫోన్ చేసి “మీకు క్యాన్సర్ ఉంది” అని చెప్పడానికి ముందే, నా పాదాల క్రింద ఉన్న బండ గురించి విశేషమైన రీతిలో దేవుడు నాకు జ్ఞాపకం చేశాడు. సంవత్సరానికి ఒకసారి సాధారణంగా చేసే పరీక్ష తరువాత యురాలజిస్ట్ (మూత్ర వ్యవస్థ వ్యాధుల నిపుణుడు) నావైపు చూసి “బయాప్సీ చేయాలనుకుంటున్నాను” అని చెప్పాడు.

“అవునా, ఎప్పుడు?” అని నేను అడిగాను.

“మీకు సమయం ఉంటే ఇప్పుడే చేస్తాను” అని ఆయన చెప్పాడు.

“నేను సమయాన్ని కేటాయిస్తాను” అని చెప్పాను.

ఆయన బయాప్సీ యంత్రాన్ని సిద్ధం చేస్తున్నాడు. నేను నీలిరంగు అంగీ ధరించడానికి సిద్ధపడుతున్నాను. ఆ కాస్త వ్యవధిలో జరగబోయే దాని గురించి ఆలోచించడానికి నాకు కొంత సమయం లభించింది. “నాకు క్యాన్సర్ ఉందేమోనని డాక్టర్‌గారు అనుమానపడుతున్నారు.” నా కళ్ళ ముందే ఈ ప్రపంచంలో నా భవిష్యత్తు మారిపోతూ ఉండగా, బైబిల్లో ఈ మధ్యనే చదివినదాన్ని దేవుడు నా మనసులోకి తీసుకొచ్చాడు.

## దేవుడు మాట్లాడాడు

మొదట ఒక విషయాన్ని నేను స్పష్టం చేయాలనుకుంటున్నాను. నాకు స్వరాలు వినబడవు. ఇంతవరకు ఎన్నడూ నేను స్వరాలను వినలేదు. బైబిల్ దేవుని వాక్యం అనే వాస్తవంలో ఆయన మాట్లాడతాడు అనే నా నమ్మకం వేళ్లూనుకొని ఉంది (తర్వాతి అధ్యాయంలో దీని గురించి మనం చర్చిద్దాం). దేవుడు తన వాక్యంలో మాట్లాడాడు. ఇప్పటికీ ఆయన మాట్లాడుతూనే ఉన్నాడు. సరిగ్గా అర్థం చేసుకుంటే బైబిల్ దేవుని స్వరం అని మనం గ్రహించగలుగుతాం.

నాకు క్యాన్సర్ ఉందని నిర్ధారించే బయాప్సీ కోసం యూరాలజిస్ట్ ఆఫీసులో ఎదురుచూస్తుండగా దేవుడు నాతో “జాన్ పైపర్, ఇది నా ఉగ్రత కాదు. జీవించినా మరణించినా నువ్వు నాతోనే ఉంటావు” అని చెప్పాడు. ఇవి నా సొంత మాటలు కావు. ఆయన నిజానికి చెప్పిన మాట ఇదే!

> “ఎందుకనగా మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రక్షణ పొందుటకే దేవుడు మనలను నియమించెను గాని ఉగ్రత పాలగుటకు నియమించలేదు. మనము మేలుకొని యున్నను నిద్రపోవుచున్నను తనతో కూడా జీవించు నిమిత్తము ఆయన మన కొరకు మృతి పొందెను” (1థెస్స 5:9,10).

మేల్కొన్నా, నిద్రించినా అంటే జీవించినా, మరణించినా నేను దేవునితో సజీవంగా ఉంటాను. ఇది ఎలా సాధ్యం? నేనొక పాపిని. దేవుని ప్రమాణాలైన ప్రేమకూ, పరిశుద్ధతకూ అనుగుణంగా బ్రతికిన రోజు ఒక్కటి కూడా నా జీవితంలో లేదు. కాబట్టి “జాన్ పైపర్, నీవు జీవించినా మరణించినా నాతోనే ఉంటావు” అని దేవుడు ఎలా చెబుతాడు? ఇది ఎలా సాధ్యం?

ఈ ప్రశ్న కోసం ఎదురు చూడకుండానే “ఇది కేవలం యేసును బట్టి” అని దేవుడు జవాబు చెప్పాడు. ఆయన మరణాన్ని బట్టి నాపై ఉగ్రత ఉండదు. అది నా పరిపూర్ణతను బట్టి కాదు. నా రక్షకుడైన యేసుక్రీస్తు పైన నా పాపాలు, నా దోషం, నా శిక్ష పడ్డాయి. ఆయన మన కోసం మరణించాడు అని వాక్యం చెబుతుంది. అందువల్ల నేను దోషం నుంచి, శిక్ష నుంచి విడుదల అయ్యాను. దేవుని కనికరంలో భద్రంగా ఉన్నాను. “నువ్వు జీవించినా మరణించినా నాతో ఉంటావు” అని దేవుడు నాతో చెప్పాడు.

క్యాన్సర్‌తోనూ, కరోనా వైరస్‌తోనూ జీవించడం దీనికి చాలా భిన్నంగా ఉంటుంది. నా పాదాల క్రింద ఇది ఒక స్థిరమైన బండ. ఇది బలహీనమైనది కాదు, ఇసుక కాదు. మీ పాదాల క్రింద ఈ బండ ఉండాలని నేను కోరుతున్నాను. అందుకే ఈ పుస్తకాన్ని రాస్తున్నాను.

## స్థిరమైన బండ కేవలం ఈ లోకం తర్వాతేనా?

“దేవుని నమ్మే మీలాంటి వ్యక్తులకు కేవలం నిరీక్షణ పరలోకం లోనే దొరుకుతుంది” అని కొందరు అంటుంటారు. మరణం తర్వాత వాళ్ళు సురక్షితంగా ఉంటే వాళ్ళకు కావాల్సింది వాళ్ళకి ఇప్పుడున్నట్టే. అయితే వాళ్ళతో మాట్లాడే ఈ దేవుని స్వరం ప్రస్తుతం కూడా ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. సృష్టి కార్యం ముగిసిన తర్వాత దేవుడు సంతోషించాడు. మరణం తర్వాత ఆయనను నమ్మిన వ్యక్తికి సంపూర్ణ సంతోషం ఇస్తాడు. అయితే ఈ మధ్యలో పరిస్థితి ఏమిటి? కరోనా వైరస్ విజృంభిస్తున్న ఈ సమయంలో దేవుడు ఎక్కడున్నాడు?

మరణం తర్వాత దేవుని సన్నిధిలో కోటాను కోట్ల సంవత్సరాలు కలిగే సంతోషానికి నేను చాలా విలువ ఇస్తాను. అంతులేని వేదనలకు పూర్తిగా విరుద్ధమైనది ఈ సంతోషం. ఇది నాకు సహేతుకంగానే అనిపిస్తుంది. అయితే ఇప్పుడు ఈ క్షణంలో నిజంగా నా పాదాల క్రింద బండ ఉంది.

మనం జీవిస్తున్నచోట కరోనా వైరస్ అనే మహమ్మారి ఉంది. కరోనా వైరస్ కాకపోతే నాపై తిరిగి దాడి చేయడానికి పొంచి ఉన్న క్యాన్సర్ రావచ్చు. లేదా 2014 నుంచి నిద్రావస్థలో ఉన్న pulmonary embolism (ఊపిరితిత్తుల్లోని రక్తనాళాల్లో గడ్డలు కట్టి రక్త ప్రసరణకు అడ్డుపడే వ్యాధి) అకస్మాత్తుగా నా మెదడులోకి పాకి ఇంకొక్క మాట కూడా రాయలేని పిచ్చోడిగా నన్ను మార్చేయవచ్చు. లేదా ముందుగా ఊహించని మరొక 100 రకాల విపత్తులు మిమ్మల్నీ, నన్నూ ఏ క్షణంలోనైనా మట్టి కరిపించవచ్చు.

నేను మాట్లాడుతున్న ఈ బండ ఇప్పుడు నా పాదాల క్రింద ఉంది. నేను ఈ మాట చెప్పగలిగాను. ఎందుకంటే సమాధికి ఆవల ఉన్న నిరీక్షణే ప్రస్తుత నిరీక్షణ. నిరీక్షణ యొక్క లక్ష్యం భవిష్యత్తే. నిరీక్షణను వర్తమానంలోనే అనుభవించాలి. ఆ ప్రస్తుత అనుభవం శక్తివంతమైనది.

నిరీక్షణే శక్తి. ప్రస్తుత శక్తి. నిరీక్షణే మనుషుల్ని ఇప్పుడు ఆత్మహత్యలు చేసుకోకుండా ఆపుతోంది. విశ్రాంతి స్థలాన్ని విడిచిపెట్టి పనికి వెళ్ళేలా సహాయపడుతుంది నిరీక్షణే. లాక్ డౌన్లో ఉన్నా, క్వారంటైన్‌లో ఉన్నా, ఇంట్లోనే ఉన్నా ఈ నిరీక్షణే జీవితానికి అర్థాన్నిస్తోంది. ఈ నిరీక్షణే ప్రేమను బలపరుస్తోంది. కష్టాలకు తెగించేలా చేస్తోంది. త్యాగం చేసేలా పురికొల్పుతుంది.

అందువల్ల మరణం తర్వాత జీవితాన్ని ఎగతాళి చేయడానికి ముందు జాగ్రత్తపడు. నీకు నిత్యత్వం అందంగా ఖచ్చితంగా ఉంటే నీ ప్రస్తుత జీవితం మధురంగా, ఫలభరితంగా ఉంటుంది.

## వైరస్‌ల విషయంలో ఆయన హస్తం

యూరాలజిస్ట్ ఆఫీసులో "జీవించినా మరణించినా నువ్వు నాతోనే ఉంటావు" అనే మధురమైన మాటను దేవుడు నాతో చెప్పాడు. యేసు యొక్క మరణ పునరుత్థానాలు కలిగించిన ఈ నిరీక్షణే ఇతరుల క్షేమం నిమిత్తం మరి ముఖ్యంగా వారి నిత్య క్షేమం కోసం నా జీవితాన్ని కుమ్మరించడానికి నాకు ప్రేరణనిస్తోంది. నా జీవితాన్ని వృధా చేయకూడదని ఆ నిరీక్షణే నన్ను పురికొల్పుతోంది. ఇదే నాలో కలవరాన్ని తొలగించి యేసుక్రీస్తు యొక్క ఔన్నత్యాన్ని ప్రచురం చేసేందుకు ఆసక్తిని నింపుతోంది. శాశ్వతమైన ఆనందంలోకి నాతోపాటు వీలైనంతమందిని తీసుకురావడానికి నాకు కలిగినది యావత్తును వ్యయపరిచేలా నన్ను నేను వ్యయపరుచుకునేలా నన్ను ఈ నిరీక్షణ ప్రోత్సహిస్తోంది (2కొరింథీ 12:15).

నేను చెప్పగలిగింది ఇదే అయినప్పటికీ పైపర్ యొక్క దేవుడు మరణం తర్వాత సంగతులకు నిశ్చయత ఇవ్వడంలో నిష్ణాతుడు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆయనేమీ చేయడని ఎవరో ఒకరు అభ్యంతరం లేవనెత్తవచ్చు.

అయితే నేను చెప్పబోయే సంగతులు విన్న తర్వాత "అమ్మో, ప్రస్తుత పరిస్థితుల్లో అంతగా దేవుడు కల్పించుకోకూడదు. కేవలం భవిష్యత్తును మాత్రమే స్థిరపరిచే దేవుని నుండి వైరస్ల విషయంలో జోక్యం చేసుకునే దేవుని గురించి మాట్లాడుతున్నావు" అని అభ్యంతరం తెలపడానికి కారణమవుతాయి.

## ఆరోగ్యం కాదు అంతరంగం బాగుంది

"మీ ఆరోగ్యం ఎలా ఉంది?" అని ప్రజలు క్యాన్సర్ నిర్ధారణ కాకముందు తరచూ నన్ను అడిగేవారు.

"బాగున్నాను" అని నేను జవాబిచ్చేవాడిని.

అయితే ఇప్పుడు "నా అంతరంగంలో అనుభూతి బాగుంది" అని అంటున్నాను.

రెండింటికీ వ్యత్యాసముంది. ప్రోస్టేట్ పరీక్షకు వెళ్ళేముందురోజు నేను బాగానే ఉన్నానని భావించాను. ఆ మరుసటి రోజు "మీకు క్యాన్సర్ ఉందని" డాక్టర్ నాకు చెప్పాడు. అంటే నేను బాగా లేనని అర్థం. ఈ మాటలు రాస్తుండగా కూడా నేను బాగున్నానో లేదో నాకు తెలియదు.

నా భవిష్యత్తు గురించిన ఆలోచనా విధానం బాగానే ఉంది. నాకున్న అర్హత కంటే అది గొప్పగానే ఉంది. నాకు తెలిసిందల్లా

"ఇప్పుడు నాకు క్యాన్సర్ ఉంది", లేదా "రక్తం గడ్డ కట్టింది", లేదా "కరోనా వైరస్ ఉండవచ్చు."

"నేను బాగానే ఉన్నాను" అని మనం చెప్పకూడదు అనే విషయాన్ని నేను వివరించాలని ప్రయత్నం చేస్తున్నాను. ఎందుకంటే మనం ఎంత బాగున్నామో లేదో దేవునికి మాత్రమే తెలుసు. దేవుడు మాత్రమే మీరు బాగున్నారా లేదా అనే విషయాన్ని నిర్ణయిస్తాడు. మీరు బాగున్నారో లేరో తెలుసుకోకుండా "నేను బాగానే ఉన్నాను" అని చెప్పకూడదు. ఎందుకంటే రేపు మీరు బ్రతికి ఉంటారో లేరో అసలు ఏ మాత్రమూ మీకు తెలియనప్పుడు "నేను రేపు చికాగో వెళ్ళి వ్యాపారం ప్రారంభిస్తాను" అని చెప్పినట్లు ఉంటుంది ఆ మాట.

అలాంటి మాట గురించి బైబిల్ ఇలా చెబుతోంది,

> "నేడైనను రేపైనను ఒకానొక పట్టణమునకు వెళ్ళి అక్కడ ఒక సంవత్సరము ఉండి వ్యాపారము చేసి లాభము సంపాదించుకొందము రండి అని చెప్పుకునే వారలారా, రేపేమి సంభవించునో మీకు తెలియదు. మీ జీవము ఏపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమయ్యే ఆవిరి వంటివారే కనుక ప్రభువు చిత్తమైతే మనము బ్రతికి ఉండి ఇది అది చేతమని చెప్పుకొనవలెను" (యాకోబు 4:13–15).

కాబట్టి మరణం తర్వాత సంగతుల్ని మాత్రమే పట్టించుకునే దేవుడు ఆదృశ్యమైపోయాడు. మన అభిప్రాయాలనే క్షణభంగురమైన పొగ మంచుపై బైబిల్ సత్యమనే ప్రకాశమానమైన సూర్యకాంతి ప్రసరించిన ఫలితం అది.

## ఆయన ముందు నిర్ణయిస్తేనే మనం దేన్నైనా చేస్తాం

నేను ఏ బండ పైన నిలబడుతున్నానో మిమ్మల్ని ఏ బండ పైన నిలబడాలని కోరుతున్నానో ఆ బండ ఇప్పటికి, ఎప్పటికీ లోకంలో దేవుని కార్యమనే బండ. "ప్రభువు చిత్తమైతే మనం బ్రతుకుతాము" అని బైబిల్ చెబుతోంది. "మీరు జీవించినా మరణించినా దేవునితో ఉంటారు" అనేది కాదు, "మీరు ఇప్పుడు జీవించాలా, మరణించాలా" అనేదాన్ని కూడా దేవుడే నిర్ణయిస్తాడు.

"జీవించడమో, మరణించడమో" అనే విషయాల్లోనే కాదు, దేవుడు అంతకు మించి మన విషయాల్లో జోక్యం చేసుకుంటాడు. ప్రభువు చిత్తమైతే మేము ఇదీ అదీ చేస్తాం. ఇదీ అదీ అనేదానికి బయట ఉన్నది ఏదీ లేదు. ఆయన అన్నింటిలో జోక్యం చేసుకుంటాడు. ఆరోగ్యమైనా అనారోగ్యమైనా, ఆర్థిక పతనమైనా లాభాలైనా, ఊపిరి ఉన్నా లేకపోయినా ఆయన పూర్తిగా కల్పించుకుంటాడు.

బయాప్సీ యంత్రం వచ్చేంతలో నేను డాక్టర్‌గారి ఆఫీసులో ఎదురు చూస్తుండగా దేవుడిలా చెప్పి ఉండాల్సింది (ఆ తర్వాత దేవుడు

చెప్పాడులెండి) “భయపడకు, నువ్వు జీవించినా మరణించినా నాతోనే ఉంటావు. ఈ మధ్యకాలంలో నీకేమీ కాదు. నేను నియమించనిది ఏదీ నీకు సంభవించదు. నేను నిర్ణయిస్తే నువ్వు బ్రతుకుతావు. నేను నిర్ణయిస్తే నువ్వు మరణిస్తావు. నీ మరణాన్ని నేను నిర్ణయించే వరకు నువ్వు ఏం చేయాలో నేను నిర్ణయిస్తాను, లేచి పని మొదలుపెట్టు.”

నేటికీ, రేపటికీ, నిత్యత్వానికీ ఇదే నా బండ!

## బండను సమీపించండి

స్థిరమైన బండ అయిన యేసుక్రీస్తు దగ్గరకు సమీపించడానికి నాతో చేరమని మిమ్మల్ని ఆహ్వానించడానికి ఈ పుస్తకం రాస్తున్నాను. దాని అర్థం మీకు స్పష్టమవుతుందని నేను ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను. చరిత్రలోని ఈ గడియలో కరోనా వైరస్ అనే మహమ్మారి ఎందరి ప్రాణాలనో బలి తీసుకుంటున్న ఈ సమయంలో క్రీస్తు ద్వారా దేవుడు ఎందుకు బండగా ఉన్నాడో, ఆయన బలమైన ప్రేమపై నిలబడడం అంటే ఏమిటో చూపించడమే నా లక్ష్యం.

# అధ్యాయం 2

# స్థిరమైన పునాది

కరోనా వైరస్ గురించి గానీ, మరి దేని గురించి గానీ నేనేమి ఆలోచిస్తున్నానో అది పెద్ద విషయం కాదు. దేవుడేమి ఆలోచిస్తున్నాడో అదే ముఖ్యమైన విషయం. తానేమి ఆలోచిస్తున్నాడో దాని గురించి దేవుడు మౌనంగా ఉండడు. ఈ సంక్షోభంలో అసందర్భమైన పేజీ ఏదీ దాదాపు బైబిల్లో లేదు.

## స్థిరమైనది, మధురమైనది

నా స్వరం గడ్డిలాంటిది, దేవుని స్వరం గ్రానైట్ లాంటిది. “గడ్డి ఎండును, దాని పువ్వు రాలును. అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడును నిలుచును” (1పేతురు 1:24). లేఖనంలోని దేవుని మాటలు నిరర్థకం కానేరవని యేసు చెప్పాడు (యోహాను 10:35). దేవుడు చెప్పిన మాటలు “సత్యమైనవి. అవి కేవలం న్యాయమైనవి” (కీర్తన 19:9). కాబట్టి ఆయన మాట జీవితానికి స్థిరమైన పునాది. “నీ శాసనములను నీవు నిత్యములుగా స్థిరపరచితివి” (కీర్తన 119:152). దేవుని మాట వినడం ఆయనను నమ్మడం నీ ఇంటిని ఇసుకపై కాక, బండపై నిర్మించుకున్నట్టే! (మత్తయి 7:24).

ఆయన మాటే మీరు వినాల్సిన ఉపదేశం. “ఆశ్చర్యమైన ఆలోచన శక్తియు అధిక బుద్ధియు అనుగ్రహించువాడు ఆయనే” (యెషయా 28:29). “ఆయన జ్ఞానమునకు మితి లేదు” (కీర్తన 147:5). ఆయన కరోనా వైరస్ గురించి ఆలోచన చెప్పినప్పుడు అది స్థిరమైనదిగా, కదల్చబడనిదిగా, శాశ్వతమైనదిగా ఉంటుంది. “యెహోవా ఆలోచన సదాకాలము నిలుచును” (కీర్తన 33:11). ఆయన మార్గం సంపూర్ణమైనది (2సమూ 22:31).

ఆయన మాటలు మధురమైనవి, విలువైనవి. “అవి బంగారము కంటె కోరదగినవి.... తేనెకంటెను జుంటి తేనె ధారలకంటెను మధురమైనవి” (కీర్తన 19:10). నిజానికి నిత్యజీవపు మాధుర్యం ఆయన మాటలే. “ప్రభువా, ఎవని యొద్దకు వెళ్ళుదము? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు” (యోహాను 6:68).

అందువల్ల కష్ట కాలాల్లోనూ సంతోష సమయాల్లోనూ దేవుని మాటలు స్థిరమైన శాంతినీ, సంతోషాన్నీ తీసుకొస్తాయి. ఈ పుస్తకాన్ని చదివే వాళ్ళందరూ ప్రవక్తయైన యిర్మీయాకు ఉన్న అనుభవాన్ని కలిగి ఉండాలన్నది నా ప్రార్థన. “నీ మాటలు నాకు సంతోషమును నా హృదయమునకు ఆనందమును కలుగజేయుచున్నవి” (యిర్మీయా 15:16).

దుఃఖపడిన వారమైనట్లుండియు ఎల్లప్పుడూ సంతోషించు వారము” 1కొరింథీ 6:10). అనే మాటలోని మర్మాన్ని గ్రహిస్తే ఈ

చారిత్రాత్మక సంక్షోభంలో కూడా దేవుని వాక్యం తన మాధుర్యాన్ని కోల్పోలేదని అర్థమవుతోంది. ఈ వాస్తవాన్ని గమనించండి. ఈ మర్మమేమిటో పూర్తిగా మీకు అర్థమవుతుంది. అయితే క్లుప్తంగా దాని గురించి ఒక మాట చెబుతున్నాను. “దుఃఖపడినవారమైనట్లుండియు ఎల్లప్పుడూ సంతోషించువారము” అనే మాటలో మర్మం ఇదే. కరోనా వైరస్‌ను నియంత్రించగలిగే సార్వభౌమత్వమే దానిని కొనసాగిస్తోంది. నిజానికి కొనసాగించడం కంటే మధురంగా చేస్తోందని చెప్పాలి. తనను నమ్మేవారి యెడల మరణంలో కూడా దేవుని ఉద్దేశాలు దయ గలిగినవే.

## మీకెలా తెలుసు?

బైబిల్ దేవుని వాక్యమని మీకెలా తెలుసు? అనేది చాలా ముఖ్యమైన ప్రశ్న. దీనికి నేనిచ్చే ముక్తసరి జవాబు: దేవుని వాక్యం ద్వారా దైవ మహిమ ప్రకాశిస్తుంది. మీ హృదయంలో దేవుని గురించి ఉన్న జ్ఞానంలో అది చక్కగా ఇమిడిపోతుంది. స్ప్రాకెట్లో గేర్, చేతి తొడుగులో చేయి, నీటిలో చేప, గాలిలో పక్షి ఇమిడినట్లే దైవ మహిమ మీ హృదయంలోని జ్ఞానంలో ఇమిడిపోతుంది.

“మీరు చెప్పిన జవాబు మర్మయుక్తంగా, వ్యక్తిగతంగా అనిపిస్తోంది. మీరలా ఎందుకు జవాబు చెప్పారు?” అని ఎవరైనా ప్రశ్న అడగడానికి అవకాశముంది. ఎందుకంటే 50 సంవత్సరాల

క్రితం నా జీవితాన్ని దేనిపై కట్టుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్న సమయంలో బైబిల్‌ని సమర్థిస్తూ పండితులూ, చరిత్రకారులూ చేసిన వాదనలు నన్ను పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. ఆ వాదనలు సత్యమైనవి, సహాయకరమైనవే. అయితే 8 సంవత్సరాల వయస్సున్న అబ్బాయి గానీ, పెద్దగా చదువుకోని సగటు పాశ్చాత్య దేశస్థుడు గానీ వాటిని అర్థం చేసుకోలేడు. ఇలా భిన్న నేపథ్యాలు, వయస్సులు ఉన్న వ్యక్తులు కూడా చీకటిలో బాణం వేయడానికి బదులు తన వాక్యాన్ని విని విశ్వసించాలని దేవుడు ఉద్దేశించాడని నాకు స్పష్టమయ్యింది.

## విశ్వాసమంటే చీకట్లో బాణం వేయడం లాంటిది కాదు

బైబిల్ ప్రకారం విశ్వాసమంటే చీకట్లో బాణం వేయడం లాంటిది కాదు. అది అధికార పూర్వకమైనది, సహేతుకమైనది. దానికి ఏ ఆధారమూ లేదు కాబట్టి దానికి విశ్వాసం అనే పేరు రాలేదు. ఆధారం ఉంది కాబట్టి దానికి విశ్వాసం అనే పేరు వచ్చింది. విశ్వాసుల్ని గుడ్డివాళ్లు అని యేసు పిలువలేదు; కాని అవిశ్వాసుల్ని ఆయన గుడ్డివాళ్లు అని పిలిచాడు (మత్తయి 15:14). చూస్తూనే ఉన్నా వాళ్ళకు కనబడదు (మత్తయి 13:13). దేవుని వాక్యంలో రక్షణార్థమైన విశ్వాసమనేది చూడడం పైనే ఆధారపడి ఉంది.

దేనిని చూడడంపై? దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనపరచు సువార్త ప్రకాశం వారికి కనబడకుండా అవిశ్వాసుల మనస్సులకు గుడ్డితనము కలుగజేయడానికి సాతాను శతవిధాలా ప్రయత్నిస్తున్నాడని బైబిల్ జవాబు చెబుతోంది (2కొరింథీ 4:4).

సువార్త అంటే రక్షణ గురించి బైబిల్ చెప్పే గాథ. సువార్త ద్వారా ప్రకాశించే ఆధ్యాత్మిక వెలుగు ఉంది. అది ఎలాంటి వెలుగు? దేవుని స్వరూపియై యున్న క్రీస్తు యొక్క మహిమ అనే వెలుగు అది. గారడీలు చేస్తే ఆ వెలుగు రాదు, ఊహల లోకంలో విహరించడం మూలంగా కలిగే భ్రమ కాదు ఈ వెలుగు. యేసుక్రీస్తు దైవ మానవుడు. ఆయన యొక్క నైతికమైన, ఆధ్యాత్మికమైన, సహజాతీతమైన మహిమ ఆయన సౌందర్యం విలువ, గొప్పతనం దేవుని వాక్యం ద్వారా ప్రకాశిస్తున్నాయి. ఈ ప్రకాశమే లేఖనాన్ని సత్యమైనదిగా రుజువు చేస్తోంది.

## నీ ఆత్మలో దేవుని గురించిన జ్ఞానం

నీ హృదయంలోని దేవుని గురించిన జ్ఞానంలో సంపూర్ణంగా ఇమిడిపోయే దైవ మహిమ లేఖనాల ద్వారా ప్రకాశిస్తోందని నేను చెప్పడానికి కారణం ఇదే! ఇది బైబిల్ సత్యమైనదనీ, విలువైనదనీ రుజువు చేస్తోంది.

ప్రతీ మనిషి ఆత్మలోనూ దేవుని గురించిన కొంత జ్ఞానం ఉంటుందని నేను నమ్ముతున్నాను. బైబిల్ దాన్ని ఇలా వివరిస్తోంది. మానవ జాతినంతటినీ ప్రస్తావిస్తూ, "దేవుని గూర్చి తెలియ శక్యమైనదేదో అది వారి మధ్య విశదమైయున్నది... వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు, కృతజ్ఞతా స్తుతులు చెల్లింపను లేదు" (రోమా 1:19,21).

ప్రతీ వ్యక్తిలోనూ ఉన్న ఈ ఎరుక ప్రకృతిలో దేవుని మహిమ చూడడంతో మనల్ని బాధ్యులుగా చేస్తోందని బైబిల్ బోధిస్తోంది. అదే విధంగా తన వాక్యం ద్వారా యేసులో దేవుని మహిమను చూడాల్సిన బాధ్యత మనపై ఉంది. "ఆకాశములు దేవుని మహిమను ప్రకటిస్తున్నాయి" (కీర్తన 19:1). మనం ఆ మహిమను చూడబద్ధులమై యున్నాము. కృతజ్ఞతా స్తుతులు చెల్లించాల్సిన వాళ్ళమై ఉన్నాము. అదే విధంగా దేవుని కుమారుడు కూడా దేవుని మహిమను ప్రదర్శిస్తున్నాడు. మనం ఆ మహిమను చూసి ఆరాధించాలి. "తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" అని అపొస్తలుడైన యోహాను తెలియ జేస్తున్నాడు.

దేవుని వాక్యం తన్నుతాను ధృవీకరించుకునే మహిమ ఇది. క్రైస్తవ లేఖనాలు దేవుని నుంచే వచ్చాయనే నమ్మకానికి ఈ మహిమ మనకు ఆధారాన్ని సమకూరుస్తోంది.

## సాంకేతికత ☐ అనుభూతి

తేనెను తేనెగా మనం ఎలా తెలుసుకుంటామో అదే విధంగా లేఖనాల్లో దేవుని మహిమను కూడా తెలుసుకుంటాము. బైబిల్ చారిత్రాత్మకంగా నమ్మదగినది అని బైబిల్ పండితులు ఆధారాలనుబట్టి రుజువు చేసినట్లు, కొన్ని రసాయన ప్రయోగాలు చేసి ఈ పాత్రలో ఉన్నది తేనె అని శాస్త్ర సాంకేతికలు తెలియజేయవచ్చు. అయితే ప్రజల్లో అధిక శాతం శాస్త్రవేత్తలూ, పండితులూ ఉండరు. రుచి చూస్తాం, కాబట్టి ఇది తేనె అని మనకు తెలుస్తుంది.

ఇదే విధంగా బైబిల్ సందేశంలోని దేవుని మహిమలో దైవ మాధుర్యం ఉంది. దేవుడు మనమందుంచిన భాగాన్ని అది తాకుతుంది. "నీ వాక్యములు నా జిహ్వకు ఎంతో మధురములు, అవి నా నోటికి తేనె కంటె తీపిగా ఉన్నవి" (కీర్తన 119:103). "యెహోవా ఉత్తముడని రుచి చూచి తెలిసికొనుడి" (కీర్తన 34:8). నిజంగా చూడడం, రుచి చూడడం అంటే ఇదే. నిజంగా ఉన్నదానిని చూడడం, రుచి చూడడమే గాని ఇది నమ్మించడం కాదు.

## మనకు ఆదరణయైన బండను సమీపించండి

"లేఖనము నిరర్థకము కానేరదు" అని యేసు చెప్పినప్పుడు (యోహాను 10:35) "ప్రతి లేఖనము దైవావేశము మూలంగా కలిగింది" అని అపొస్తలుడైన పౌలు చెబుతున్నప్పుడు (2తిమోతి 3:16) లేఖనాలను రాసిన వ్యక్తులు "పరిశుద్ధాత్మ వలన ప్రేరేపించ

బద్దారని" అపొస్తలుడైన పేతురు చెప్పినప్పుడు, "ఆమేన్" అని మన హృదయం అంటుంది. మనం రుచి చూశాము, చూశాము. మనకు తెలుసు. ఆ ఎరుకకు చక్కటి ఆధారముంది. మనం చీకట్లో బాణం వేయడం లేదు.

బైబిల్‌లోని ఈ మాటలు మన ఆత్మలో ప్రతిధ్వనిస్తుంటాయి. "నీ వాక్య సారాంశం సత్యము" (కీర్తన 119:160). "యెహోవా, నీ వాక్యము ఆకాశమందు నిత్యము నిలకడగా నున్నది" (కీర్తన 119:89). "దేవుని మాటలన్నియు పుటము పెట్టబడినవే" (సామెతలు 30:5).

ఇది జరిగినప్పుడు కరోనా వైరస్ సంక్షోభంలోనైనా సరే దేవుని సర్వసత్యం మన భావోద్వేగాలను అకస్మాత్తుగా ఆశ్చర్యకరంగా ప్రభావితం చేస్తుంది. అది మనకు అసమానమైన ఆదరణ కలిగిస్తుంది. "నా అంతరంగమందు విచారములు హెచ్చుగా నీ గొప్ప ఆదరణ నా ప్రాణమునకు నెమ్మది కలుగజేయుచున్నది" (కీర్తన 94:19). "విరిగిన హృదయము గలవారికి యెహోవా ఆసన్నుడు, నలిగిన మనస్సు గలవారిని ఆయన రక్షించును. నీతిమంతునికి కలుగు ఆపదలు అనేకములు. వాటన్నింటిలో నుండి యెహోవా వానిని విడిపించును" (కీర్తన 34:18,19).

కరోనా వైరస్ విజృంభిస్తున్న ఈ సమయంలో దేవుడు ఆదరించినట్లుగా ఏ మనిషీ కూడా మన ఆత్మలను ఆదరించలేడు. ఆయనిచ్చే ఆదరణ స్థిరమైనది. తుఫాను చెలరేగిన సముద్రంలో గొప్ప బండ కలిగించే ఆదరణ ఇది. తన వాక్యమైన బైబిల్ నుంచే ఆ ఆదరణ కలుగుతుంది.

# అధ్యాయం 3

# మనకు బండయైనవాడు నీతిమంతుడు

దేవుడు మనకు బండగా ఉండాలంటే, ఆయన నీతిమంతుడై ఉండాలి. దుర్నీతిపరుడైన బండ ఎండమావి వంటివాడు. దేవుడు నీతిమంతుడు, పరిశుద్ధుడు, మంచివాడు అనే మన నమ్మకమే ప్రపంచవ్యాప్తంగా విజృంభిస్తున్న ఈ విషవ్యాధిని వణికించేది. ఇలాంటి పరిస్థితుల్లో దేవుడు నీతిమంతుడు కాకపోతే, మనకు బండ (ఆధారమేదీ) ఉండదు.

దేవుని పరిశుద్ధత, నీతి, మంచితనం అంటే ఏమిటి? అని మనం అడగాలి. వాటి గురించి మనకు తెలియకపోతే, ఈ కరోనా వైరస్ వ్యాప్తే వాటిని ఛిన్నాభిన్నం చేసిందా? లేదా మనల్ని రక్షించే బండకు అవే నిత్యమైన పునాదులుగా ఉన్నాయా? అనేవి ఎలా తెలుసుకుంటాం?

దేవుని పరిశుద్ధత, నీతి, మంచితనం అనేవి ఒకేలా ఉండవు. కాని ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయని బైబిల్ మనకు తెలియజేస్తోంది. "దేవుని పరిశుద్ధత"తో మనం మొదలుపెడదాం. "దేవుని పరిశుద్ధత" అంటే ఏమిటి?

## సమస్తానికీ అతీతమైనది, అనంత విలువ కలిగినది

పాత నిబంధనలో 'పరిశుద్ధత'ను సూచించే మూల పదానికి అర్థం, సామాన్యమైన, సాధారణమైన వాటికి భిన్నంగా, ప్రత్యేకంగా ఉండడం. ఈ భావాన్ని దేవునికి అన్వయించినప్పుడు ఈ ప్రత్యేకత దేవుడు ఒక విలక్షణమైన వర్గానికి చెందినవాడని తెలియజేస్తోంది. ఆయన అత్యంత అరుదైన, అత్యంత విలువైన వజ్రం వంటివాడు. ఈ విధమైన దైవ విశిష్టతను తెలియజేయడానికి "అతీతుడు"అనే పదాన్ని ఉపయోగించవచ్చు. సమస్త వాస్తవాలన్నింటికీ అతీతుడైనంత అరుదైనవాడు, విలక్షణమైనవాడు దేవుడు. ఆయన సమస్తానికీ పైనున్నవాడు, సమస్త సృష్టి కంటే విలువైనవాడు.

బండతో మాట్లాడమని దేవుడు ఆదేశించగా, మోషే దానితో మాట్లాడడానికి బదులు దానిని కొట్టాడు. అప్పుడు దేవుడు అతణ్ణి గద్దించాడు. "మీరు ఇశ్రాయేలీయుల కన్నుల యెదుట నా పరిశుద్ధతను సన్మానించునట్లు నన్ను నమ్ముకొనకపోతిరి" (సంఖ్యా 20:12). మరొక రీతిగా చెప్పాలంటే, మోషే దేవుణ్ణి విలక్షణమైనవాడిగా, అత్యంత నమ్మదగినవాడిగా పరిగణించడానికి బదులు విస్మరించదగిన మరొక సామాన్య మానవాధికారిగానే పరిగణించాడు.

యెషయా 8:12–13 వచనాల్లో దేవుడు యెషయాతో ఇలా చెప్పాడు, "ప్రజలు భయపడుదానికి భయపడకుడి. దాని వలన దిగులు పడకుడి. సైన్యములకధిపతియగు యెహోవాయే పరిశుద్ధడనుకొనుడి.

మీరు భయపడవలసినవాడు ఆయనే. ఆయన కోసరమే దిగులు పడవలెను.” మరొక రీతిగా చెప్పాలంటే, మీరు సాధారణంగా భయపడే, దిగులుపడే వ్యక్తుల్లోనూ, విషయాల్లోనూ దేవుణ్ణి చేర్చకండి. ఆయనను ప్రత్యేకమైనవానిగా, విలక్షణమైనవానిగా పరిగణించండి. సమస్తానికీ ఆయన అతీతుడు అని భావించండి. భయపడండి, వణకండి!

అందువల్ల దేవుని పరిశుద్ధత అనేది ఆయన యొక్క అనంతమైన గొప్పతనం, సమస్తానికీ మించిన విలువ. ఆయన ఒక్కడే ఒక ప్రత్యేకమైన వర్గానికి చెందినవాడు. తన ఉనికి కోసం ఆయన ఎవ్వరి పైనా ఆధారపడడు. ఆయన స్వయంభవుడు. ఆయనకు అవసరమైనది ఏదీ ఉండదు. ఆయన దేనిపైనా ఆధారపడడు. ఆయన సంపూర్ణుడు, పరిపూర్ణుడు. ఆయనే సమస్త వాస్తవానికి ఆధారభూతుడు కాబట్టి ఆయన అత్యంత విలువ కలిగినవాడు.

## అన్నిటికీ మించినవాడే గాని ఒంటరివాడు కాడు

దేవుడు సమస్త సృష్టి కంటే గొప్పవాడు, ఉన్నతుడు, అనంతుడు. అయితే ఆయన ప్రేమ లేనివాడు కాడు, ఒంటరివాడు కాదు. చారిత్రాత్మక త్రిత్వ సిద్ధాంతం అనేది పూర్తిగా వాక్యానుసారమైనది. దేవుడు ముగ్గురు వ్యక్తులుగా ఉనికిలో ఉన్నాడు. ఈ ముగ్గురు వ్యక్తులకు దైవసారం ఉంది. అయితే ఒక్కడే దేవుడున్నాడు, ముగ్గురు దేవుళ్ళు

కాదు. మానవ జ్ఞానానికి అంతుచిక్కని రీతిలో ఈ ఒక్కడే దేవుడు "తండ్రి కుమార పరిశుద్ధాత్మలు"గా ఐక్యమై ఉన్నాడు. ఈ ముగ్గురు వ్యక్తులూ నిత్యులే. ఆరంభం లేనివాళ్ళే. ముగ్గురులో ప్రతి ఒక్కరూ నిజంగా దేవుడే!

పరిశుద్ధత (దేవుని యొక్క అనంతమైన విలువ, గొప్పతనం) అంటే ఆయన ఒంటరివాడనీ, ఆయన అనంతమైన శ్రేష్ఠతలో ప్రేమ లేనివాడనీ కాదు. తండ్రియైన దేవుడు కుమారుణ్ణి సంపూర్ణంగా అపరిమితంగా ఎరిగినవాడు, ప్రేమిస్తున్నాడు (మార్కు 1:11; 9:7; కొలస్సీ 1:13). దేవుని కుమారుడు తండ్రిని సంపూర్ణంగా, అపరిమితంగా ఎరిగినవాడు, ప్రేమిస్తున్నాడు (యోహాను 14:31). అదే విధంగా తండ్రి కుమారులిద్దరూ పరిశుద్ధాత్మను ఎరిగియున్నారు, ప్రేమిస్తున్నారు.

ఈ విషయం ఎందుకు ప్రాధాన్యమైనది? ఎందుకంటే దేవుని యొక్క సంపూర్ణతకూ, పరిపూర్ణతకూ ఈ పరిపూర్ణమైన త్రిత్వ సహవాసం అత్యవసరం. వయన పరిశుద్ధతకు అనగా ఆయన అనంత మైన విలువకూ, సౌందర్యానికీ, గొప్పతనానికీ ఇది అత్యవసరం.

## పరిశుద్ధత నీతితో ముడిపడి ఉన్న లక్షణం

దేవుని పరిశుద్ధత గురించిన వివరణలో కొంతవరకు చర్చించని కోణం మరొకటుంది. దేవుని పరిశుద్ధత గురించి కేవలం "ఆయన

విశిష్టత, విలక్షణ" అనే కోణంలోనే కాక, "ఆయన నైతికత కోణంలో" కూడా బైబిల్ మాట్లాడుతోంది. పరిశుద్ధంగా ఉండడమంటే కేవలం ప్రత్యేకమైనవానిగా, సమస్తానికీ అతీతునిగా ఉండడం మాత్రమే కాదు, నీతిమంతునిగా కూడా ఉండడం.

దేవుని కోణంలో మనం కరోనా వైరస్‌ను ఎలా చూడాలో అనేదాన్ని గొప్పగా ప్రభావితం చేసే ప్రశ్నను ఇది లేవనెత్తుతుంది. నీతి అంటే సరైనది చేయడం. కాబట్టి సరైనది చేయడమంటే సరియైన ప్రమాణంతో ఏకీభవించడమనీ అర్థం కాబట్టి దేవుని నీతి దేనితో ఏకీభవిస్తుంది?

సృష్టికి ముందు, దేవునికి బయట ప్రమాణాలేమీ లేవు. ఆయనకు వేరుగా ఆయన దేనితోనూ ఏకీభవించవలసిన అవసరం లేదు. సృష్టికి ముందు దేవుడు మాత్రమే వాస్తవం. అందువల్ల దేవుడొక్కడే ఉన్నప్పుడు దేవుడు చేయాల్సిన సరైన పనిని మీరెలా నిర్వచిస్తారు? అంటే దేవుని పరిశుద్ధత ఆయన యొక్క ఔన్నత్యాన్ని మాత్రమే కాక, ఆయన నీతిని కూడా ఎలా కలిగి ఉంది?

దేవుని నీతికి ప్రమాణం దేవుడే అనేదే పై ప్రశ్నకు జవాబు. పునాదిలాంటి బైబిల్ నియమం ఇదే: "ఆయన తన స్వభావమునకు విరోధముగా ఏదియు చేయలేడు" (2తిమోతి 2:13). తన అనంత మైన విలువకూ, సౌందర్యానికీ, గొప్పతనానికీ విరుద్ధంగా ఆయన పనిచేయలేడు. దేవునికి ఇదే ప్రమాణం.

అంటే దేవుడు తన విలువకూ, సౌందర్యానికీ, గొప్పతనానికీ అనుగుణంగా పనిచేయడానికి తీసుకున్న అచంచలమైన తీర్మానమే ఆయన నీతి అని అర్థం. అంటే దేవుని యొక్క ప్రతీ అభిలాష, ప్రతీ ఆలోచన, ప్రతీ మాట, ప్రతీ చర్య అన్ని సమయాల్లోనూ తన అనంతమైన విలువకూ అసమానమైన సంపూర్ణతకూ, సౌందర్యానికీ అనుగుణంగా ఉంటుంది. దేవునికి తన విలువనూ, సౌందర్యాన్నీ, గొప్పతనాన్నీ విడిచిపెట్టడం అసాధ్యం. విడిచిపెట్టాలనుకోవడం సరి కాదు. అప్పుడు అంతిమ ప్రమాణమే చిన్నాభిన్నమైనట్లు ఆయన దుర్నీతిపరుడవుతాడు.

## నీతి మంచితనంతో ముడిపడినది

దేవుని మంచితనానికీ, ఆయన పరిశుద్ధతకూ, నీతికీ మధ్య కొంత వైవిధ్యం ఉంది. అయితే అవి ఒకదానితో ఒకటి ముడిపడినవే. ఆయన మంచితనంలో పరిశుద్ధత పొంగిపొర్లుతుంది. మంచితనాన్ని కనబరచడాన్ని ఆయన నీతే నడిపిస్తుంది. అవి ఒకదానికొకటి ఎన్నడూ విభేదించుకోవు.

దేవుని మంచితనమంటే దాతృత్వంతో కూడిన ఆయన మనస్సు. మనుషుల్ని దీవించేది దేవుని మంచితనమే. అసమానమైన ఆయన సంపూర్ణత ఆయన పరిపూర్ణత అనేది పొర్లిపారే జలధారలాంటిది. అందువల్లనే ఆయన దాతృత్వం కలిగిన మనస్సు గలవానిగా

ఉన్నాడు. దేవునికి అవసరాలు ఏమీ ఉండవు. అందువల్ల తనలో ఉన్న లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి మనిషి ఇతరుల్ని తన స్వార్థానికి ఉపయోగించుకున్నట్లు దేవుడు ఎన్నడూ చేయడు. ఇవ్వడమే గాని తీసుకోవడం ఆయన స్వభావం కాదు. “ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైనను కొదువ యున్నట్టు మనుష్యుల చేతులలో సేవింపబడువాడు కాడు” (అపొ.కా. 17:25).

అయితే ఆయన మంచితనం ఆయన నీతికి ఏమాత్రమూ సంబంధం లేనిది కాదు. తన అనంతమైన విలువనూ, సౌందర్యాన్నీ, గొప్పతనాన్నీ తృణీకరించే విధంగా దేవుడు తన మంచితనాన్ని అనుగ్రహించడు. ఇందువల్లనే దేవుని నీతిలో మంచితనంతోపాటు అంతిమ తీర్పు ద్వారా శిక్ష కూడా ఉంటుంది. మారుమనస్సు పొందనివాళ్ళని దేవుడు నరకంలో శిక్షించినప్పుడు దేవుడు వాళ్ళకి మంచితనాన్ని అనుగ్రహించడం లేదు. అయితే ఆయన మంచివానిగా ఉండడం మానుకోవడం లేదు. ఆయన పరిశుద్ధత, నీతి తన మంచితనాన్ని అనుగ్రహించడాన్ని నియంత్రిస్తాయి.

అందువల్లనే తనకు భయపడేవారి యెడల తనను ఆశ్రయించే వారి యెడల మాత్రమే ఆయన మంచితనం కనపరచబడుతుంది. “నీయందు భయభక్తులు గలవారి నిమిత్తము నీవు దాచియుంచిన మేలు ఎంతో గొప్పది. నరుల యెదుట నిన్ను ఆశ్రయించువారి నిమిత్తము నీవు సిద్ధపరచిన మేలు ఎంతో గొప్పది” (కీర్తన 31:19).

ఈ భయభక్తులూ, విశ్వాసమూ దేవుని మంచితనాన్ని సంపాదించవు. పరిమితమైన, పూర్తిగా దేవునిపై ఆధారపడాల్సిన పాపులు దేవుని నుంచి దేన్నీ సంపాదించలేరు. పాపులకు దేవుడు చూపించే మంచితనం అన్ని సమయాల్లోనూ ఉచితమైనదే. వారు ఆ మంచితనానికి ఎన్నడూ అర్హులు కారు. అయితే తనకు భయపడే వారికీ, తనను ఆశ్రయించేవారికీ తన విస్తారమైన మంచితనాన్ని దేవుడు ఎందుకు చూపిస్తాడు? ఎందుకంటే ఈ భయభక్తులూ, విశ్వాసమూ దేవుని యొక్క విలువనూ, సౌందర్యాన్నీ, గొప్పతనాన్నీ ప్రదర్శిస్తాయి (రోమా 4:20). కాబట్టి దేవుణ్ణి ఘనపరిచే అలాంటి వైఖరులను ఆయన నీతి ఆయన వాటిని అంగీకరించేలా చేస్తుంది.

## మరైతే కరోనా వైరస్ పరిస్థితి ఏమిటి?

తర్వాతి అధ్యాయంలో దేవుని సర్వజ్ఞానం గురించీ, సమస్త సృష్టిపై ఆయన సార్వభౌమ పరిపాలన గురించీ చర్చిద్దాం. అయితే ఈ అధ్యాయంలో ఇంతవరకు మనం చూసినదాన్నిబట్టి “కరోనా వైరస్‌లో దేవుని జోక్యం ఆయన పరిశుద్ధతనూ, నీతినీ, మంచితనాన్నీ కొట్టిపారేస్తుందనే అభిప్రాయానికి రాకుండా మనల్ని అడ్డుకుంటుంది.” మనుషులు శ్రమపడుతున్నారంటే దేవుడు దుర్నీతిపరుడు అనుకోవడం మన అమాయకత్వంతో కూడిన అజ్ఞానం. దేవుడు తన ప్రపంచాన్ని పరిపాలిస్తున్నప్పుడు పరిశుద్ధునిగా, మంచివానిగా ఉండడం మానుకున్నాడని చెప్పడం మన అవివేకం.

మనందరమూ పాపులమే. ఇందులో ఎలాంటి భేదమూ లేదు. మనం సుఖ సంతోషాల కోసం దేవుని విలువనూ, సౌందర్యాన్నీ, గొప్పతనాన్నీ మనందరం మార్చేశాము (రోమా 1:23; 3:23). మనం గ్రహించినా గ్రహించకపోయినా ఇది దేవునికి చాలా అవమానకర మైనది, హేయమైనది. అందువల్ల మనం శిక్షకు పాత్రులం. దేవుని మహిమను అవమానించడాన్ని బట్టి మనం ఆయన పరిశుద్ధమైన ఉగ్రతకు పాత్రులం. స్వభావసిద్ధంగా మనం ఉగ్రతా పాత్రమైన పిల్లలమని బైబిల్ చెబుతోంది (ఎఫెసీ 2:3). అంటే దేవుడు తన మంచితనాన్ని మనకు చూపించకపోయినా ఆయన పరిశుద్ధునిగానే, నీతిమంతునిగానే ఉంటాడని అర్థం.

అందువల్ల కరోనా వైరస్ దేవుడు అపవిత్రుడనీ, దుర్నీతిపరుడనీ, మంచితనం లేనివాడనీ చూపించదు. ఈ శ్రమ దినాల్లో మన బండయైనవాడు దుర్నీతిపరుడు కాడు, ఆయన అపవిత్రుడు కాడు. “మన దేవునివంటి పరిశుద్ధ దేవుడు ఒక్కడునూ లేడు.... మన దేవునివంటి ఆశ్రయదుర్గమేదియు లేదు” (1సమూ 2:2). మనకు ఆశ్రయదుర్గమైనవాడు ఒక ఎండమావి వంటివాడు కాడు.

# అధ్యాయం 4

# సమస్తముపై సార్వభౌముడు

రెండవ అధ్యాయంలో “చేదైన దైవకార్యం” అనే పదబంధాన్ని (Phrase) ఉపయోగించాను. కరోనా వైరస్ గురించి చెప్పాల్సిన మాట ఇదే. దేవుడు చేసే కొన్ని కార్యాలను చేదైనవిగా వర్ణించడం దేవదూషణ కాదు. రూతుకు అత్తగారైన నయోమి కరువు కాలంలో విదేశానికి వెళ్ళి అక్కడ నివసించినప్పుడు తన భర్తనూ, ఇద్దరు కుమారులనూ కోల్పోయింది. ఒక కోడలు తనకు దూరమయ్యింది.

> “సర్వశక్తుడు నాకు చాలా దుఃఖము కలుగజేసెను… నేను సమృద్ధి గలదాననై వెళ్లితిని. యెహోవా నన్ను రిక్తురాలినిగా తిరిగి రాజేసెను…. యెహోవా నా మీద విరుద్ధముగ సాక్ష్యము పలికెను. సర్వశక్తుడు నన్ను బాధ పరచెను” అని ఆమె చెప్పింది (రూతు 1:20–21).

ఆమె అబద్ధమాడడం లేదు, అతిశయోక్తిగా మాట్లాడడం లేదు, అభాండం వేయడం లేదు. ఆమె తనకు ఎదురైన చేదు వాస్తవాన్ని వివరిస్తోంది. “దేవుడు నన్ను దుఃఖపెట్టాడు” అనే మాట దేవుని మార్గాలపై నింద వేసినట్లు కాదు. శ్రమపడిన మనిషి నుండి వెలువడే ఒక వర్ణన.

“దుఃఖపడిన వారమైనట్లుండియు ఎల్లప్పుడు సంతోషించు వారము” (1కొరింథీ 6:10) అనే మాటలోని మర్మాన్ని నేర్చుకుంటే చేదైన అనుభవాల మధ్యలో సైతం దేవుని వాక్యపు మాధుర్యం తగ్గిపోదని కూడా రెండవ అధ్యాయంలో నేను చెప్పాను. మనం ఈ మర్మం గురించి తిరిగి చర్చిద్దామని నేను అన్నాను. ఒక్క మాటలో క్లుప్తంగా నేను దాన్ని చెప్పాను. “కరోనా వైరస్‌ను నియంత్రించగలిగే సార్వభౌమత్వమే దానిని కొనసాగిస్తోంది.” దీనిని తెలుసుకుంటే మన ఆలోచనలో ఎంతో మార్పు కలుగుతుంది. ఇది నిజమేనా?

## దేవుడేమి చేయదలిస్తే, దానినే చేస్తాడు

దేవుడు సర్వాన్నీ పాలించేవాడు, సర్వజ్ఞాని అని చూపించడమే 4,5 అధ్యాయాల్లో నా లక్ష్యం. కరోనా వైరస్ పైన కూడా ఆయన సార్వభౌముడే. ఇదొక మంచి వార్త అని మీకు చూపించాలనుకుంటున్నాను. దేవుడు నియమించిన చేదైన అనుభవాల మధ్యలో ఆయన మాధుర్యాన్ని ఆస్వాదించడానికి రహస్యం ఇదే.

దేవుడు సర్వాన్నీ పరిపాలించేవాడు అంటే ఆయన సార్వభౌముడు అని అర్థం. “ఆయన సార్వభౌమత్వం” అంటే “ఆయన కచ్చితంగా చేయదలచిన వాటనన్నింటినీ చేస్తాడు, చేయగలడు” అని అర్థం. “కచ్చితంగా” అనే పదాన్ని నేను ఉపయోగించాను. ఎందుకంటే ఆయన సంపూర్ణంగా నెరవేర్చని కొన్ని సంగతులను ఆయన కోరతాడు.

తానే స్వయంగా చేయడానికి పూనుకొని కొన్ని కోరికలను వ్యక్త పరుస్తాడు. ఆ విధంగా ఆ కోరికలు కచ్చితంగా నెరవేరతాయని చెప్పలేము. ఆ కోరికను నెరవేర్చుకోవడానికి ఆయన స్వయంగా రంగంలోకి దిగడు.

ఉదాహరణకు, విలాప వాక్యములు 3:32-33 గురించి ఆలోచించండి.

> "ఆయన బాధపెట్టినను తన కృపా సమృద్ధిని బట్టి జాలిపడును. హృదయపూర్వకముగా ఆయన నరులకు విచారమునైనను బాధనైనను కలుగజేయడు."

ఆయన మనకు దుఃఖాన్ని కలుగజేస్తాడు. అయితే హృదయ పూర్వకంగా కాదు. ఆయన స్వభావంలో (హృదయంలో) కొన్ని లక్షణాలు మనల్ని బాధపరచడానికి సమ్మతించవు. అదే సమయంలో మనల్ని దుఃఖపెట్టడమనే పరిశుద్ధమైన నీతితో కూడిన పనిని శాసించే లక్షణాలు కూడా ఆయన స్వభావంలో ఉన్నాయి.

ఆయన ద్విమనస్కుడు కాడు. ఆయన గుణలక్షణాల మధ్యనున్న పొందికలో పరిపూర్ణమైన సౌందర్యం ఉంది. ఆయన గుణ లక్షణాలన్నీ సంపూర్ణంగా ఒక దానితో ఒకటి ఏకీభవిస్తాయి. అయితే ఆయన సంక్లిష్టత లేని వాడు కాడు. ఆయన గుణ లక్షణాల్లో ఏదీ ఒంటరిగా పనిచేయవు గాని కలిసికట్టుగా పనిచేస్తాయి.

"దేవుని సార్వభౌమత్వం అంటే ఆయన కచ్చితంగా చేయదలచిన వాటినన్నింటినీ ఆయన చేయగలడు, చేస్తాడు" అని నేను చెప్పాను. "ఆయనకు బయట ఉన్న శక్తి ఏదీ కూడా ఆయన చిత్తాన్ని ఆటంకపరచలేదు" అని నా ఉద్దేశం. ఏదైనా జరగాలని ఆయన నిర్ణయిస్తే అది జరుగుతుంది. మరొకరీతిగా చెప్పాలంటే, సమస్తమూ జరుగుతూ ఉంది. ఎందుకంటే అలా జరగాలని దేవుడు నిర్ణయించాడు కనుక.

## సర్వవ్యాప్తమైన సార్వభౌమత్వం

దేవునిగా ఉండడంలో అత్యంత ముఖ్యమైన విషయం ఇదేనని యెషయా బోధిస్తున్నాడు.

> ''చాల పూర్వమున జరిగినవాటిని జ్ఞాపకము చేసికొనుడి. దేవుడను నేనే; మరి ఏ దేవుడును లేడు. నేను దేవుడను, నన్ను పోలినవాడెవడు లేడు. నా ఆలోచన నిలుచుననియు నా చిత్తమంతయు నెరవేర్చు కొనెదననియు చెప్పుకొనుచు ఆది నుండి నేను కలుగ బోవువాటిని తెలియజేయుచున్నాను. పూర్వ కాలము నుండి నేనే యింక జరుగనివాటిని తెలియజేయు చున్నాను' (యెషయా 46:9,10).

దేవునిగా ఉండడమంటే ఎల్లప్పుడూ తన ఆలోచనే నిలిచేలా చేయడం అని అర్థం. ఏ భవిష్యత్ సంఘటనలు జరుగుతాయో ప్రకటించడం మాత్రమే కాదు, దేవుడే వాటిని జరిగేలా చేస్తాడు. ఆయన మాట్లాడతాడు. ఆ తర్వాత "నేను చెప్పిన వాక్యమును నెరవేర్చుటకు నేను ఆతురపడుచున్నాను" అని ఆయన అంటున్నాడు (యిర్మీయా 1:12).

అంటే శ్రమల ద్వారా యోబు నేర్చుకున్నట్లు "నీవు సమస్త క్రియలను చేయగలవనియు, నీవు ఉద్దేశించినది ఏదియు నిష్ఫలము కానేరదు" అని అర్థం (యోబు 42:2). నెబుకద్నెజరు కూడా దేవుని దయ మూలంగా కలిగిన అవమానం నుంచి నేర్చుకుని ఇలా అన్నాడు,

> "భూనివాసులందరు ఆయన దృష్టికి ఎన్నికకు రాని వారు; ఆయన పరలోక సేన యెడలను, భూనివాసుల యెడలను తన చిత్తము చొప్పున జరిగించువాడు; ఆయన చేయి పట్టుకొని నీవేమి చేయుచున్నావని ఆయనతో చెప్పుటకు ఎవడును సమర్థుడు కాడు" (దాని 4:35).

కీర్తనకారుడు ఇలా చెబుతున్నాడు,

> "ఆకాశమందును భూమియందును సముద్రముల యందును మహా సముద్రముల యందును ఆయన తనకిష్టమైనదంతయు జరిగించువాడు" (కీర్తన 135:6).

అపొస్తలుడైన పౌలు దాని సారాంశాన్ని క్లుప్తంగా ఇలా చెబుతున్నాడు,

> "తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయమ చొప్పున ఆయన సమస్తమును జరిగించుచున్నాడు" (ఎఫెసీ 1:11).

ఆయన జరిగిస్తున్నది సమస్త కార్యాలను, కొన్నింటిని మాత్రమే కాదు!

మరొకరీతిగా చెప్పాలంటే, దేవుని సార్వభౌమత్వం అంటే సర్వాన్నీ పర్యవేక్షించేది, సర్వవ్యాప్తమైనది అని అర్థం. ఈ లోకమంతటి పైన ఆయన సంపూర్ణమైన అధికారాన్ని కలిగి ఉన్నాడు. గాలి (లూకా 8:25), మెరుపు (యోబు 36:32), మంచు (కీర్తన 147:16), కప్పలు (నిర్గమ 8:1–15), పేలు (నిర్గమ 8:16–19), ఈగలు (నిర్గమ 8:20–32), మిడతలు (నిర్గమ 10:1–20), పక్షులు (నిర్గమ 16:6–8), పురుగులు (యోనా 4:7), చేప (యోనా 2:10), పిచ్చుకలు (మత్తయి 10:29), గడ్డి (కీర్తన 147:8), మొక్కలు (యోనా 4:6), కరువు (కీర్తన 105:16), సూర్యుడు (యెహో 10:12–13). చెరసాల ద్వారాలు (అపొ.కా. 5:19), గుడ్డితనం (నిర్గమ 4:11; లూకా 18:42), చెవుడు (నిర్గమ 4:11; మార్కు 7:37), పక్షవాతం (లూకా 5:24–25), జ్వరం (మత్తయి 8:15), ప్రతీ విధమైన వ్యాధి (మత్తయి 4:23), ప్రయాణ ప్రణాళికలు (యాకోబు 4:13–15), రాజుల

హృదయాలు (సామెతలు 21:1; దానియేలు 2:21), జనాలు (కీర్తన 33:10), హంతకులు (అపొ.కా. 4:27–28), ఆధ్యాత్మిక మరణం (ఎఫెసీ 2:4–5) మొదలైన వాటినన్నింటినీ ఆయన పరిపాలిస్తున్నాడు. అవన్నీ ఆయన సార్వభౌమత్వాన్ని నెరవేరుస్తాయి.

## దేవుని గురించిన ఉద్వేగపూరితమైన అభిప్రాయాలకు ఇది సమయం కాదు

దేవుడే కరోనా వైరస్‌ను పంపించాడు. దేవుని గురించిన ఉద్వేగపూరితమైన అభిప్రాయాలకు ఇది సమయం కాదు. ఇది చాలా చేదైన కాలం; దేవుడే దీనిని నియమించాడు. దేవుడే దీనిని పరిపాలిస్తున్నాడు. ఆయనే దీనిని అంతం చేస్తాడు. ఈ వైరస్‌లో ఏ భాగమూ ఆయన అధికారానికి అతీతంగా లేదు. జీవ మరణాలు ఆయన చేతిలోనే ఉన్నాయి.

> “నేను నా తల్లి గర్భములో నుండి దిగంబరినై వచ్చితిని, దిగంబరినై అక్కడికి తిరిగి వెళ్లెదను; యెహోవా ఇచ్చెను, యెహోవా తీసికొనిపోయెను; యెహోవా నామమునకు స్తుతి కలుగును గాక” (యోబు 1:21)

అని చెప్పినప్పుడు యోబు తన పెదవులతో పాపం చేయలేదు (యోబు 1:22).

యోబుకు పదిమంది బిడ్డల్ని అనుగ్రహించిందీ, తీసుకొన్నదీ యెహోవాయే!

దేవుని సన్నిధిలో ఏ ఒక్కరికీ జీవించడానికి హక్కు లేదు. మనం తీసుకునే ప్రతీ ఊపిరీ ఆయన యొక్క కృపా వరమే. మన ప్రతీ గుండె చప్పుడుకు మనం అయోగ్యులమే. జీవ మరణాలు అంతిమంగా దేవుని హస్తాల్లోనే ఉన్నాయి.

“ఇదిగో నేను నేనే దేవుడను
మృతి నొందించువాడను
బ్రతికించువాడను నేనే
గాయపరచువాడను స్వస్థపరచువాడను నేనే
నా చేతిలోనుంచి విడిపించువాడెవడును లేడు”
(ద్వితీ 32:39).

కాబట్టి కరోనా వైరస్‌తో గానీ, ప్రాణాలకు అపాయకరమైన మరే ఇతర పరిస్థితిలో గానీ మన భవిష్యత్తును ఊహించుకుంటే మనం ఎలా ఆలోచించాలో, ఏమి మాట్లాడాలో యాకోబు మనకు చెబుతున్నాడు.

“కనుక ప్రభువు చిత్తమైతే మనము బ్రతికియుండి ఇది అది చేతమని చెప్పుకొనవలెను” (యాకోబు 4:15).

ఆయన కిష్టమైతే మనం బ్రతుకుతాము, లేదంటే బ్రతకము.

నాకు తెలిసినంతమట్టుకు, ఈ పుస్తకం ప్రచురింపబడే వరకు నేను జీవించకపోవచ్చు. కరోనా వైరస్ సోకిన బంధువు కనీసం ఒక్కరు నాకున్నారు. నా వయస్సు 74 ఏళ్లు. నా ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టింది. తరచుగా Bronchitis (శ్వాసనాళ రోగం) నన్ను ఇబ్బంది పెడుతుంటుంది. అయితే ఈ విషయాలేమీ నిర్ణయించవు. నిర్ణయం తీసుకొనేది దేవుడే! అది మంచి వార్తేనా? అవును. తరువాతి అధ్యాయంలో ఇదెందుకు మంచివార్తో నేను చూపించడానికి ప్రయత్నిస్తాను.

# అధ్యాయం 5

# ఆయన పాలనలోని మాధుర్యం

కరోనా వైరస్‌పై, నా జీవితంపై దేవుని సార్వభౌమత్వం గురించిన వార్తను మధురమైన ఉపదేశంగా నేనెందుకు స్వీకరించాలి? “కరోనా వైరస్‌ను ఆపగలిగే సార్వభౌమత్వమే దానిని కొనసాగిస్తుందనీ, అదే రహస్యం” అని నేను చెప్పాను. శ్రమల్లో దేవుని సార్వభౌమత్వాన్ని నిరాకరిస్తే, సమస్తాన్నీ మేలుగా మార్చగల సార్వభౌమత్వాన్ని కూడా నీవు తృణీకరించినట్లే!

## దేవుణ్ణి సింహాసన భ్రష్టునిగా చేయడం శుభవార్త కాదు

వ్యాధి ఉన్న సమయంలో పరిపాలిస్తున్న సార్వభౌమత్వమే నష్టంలోనూ పరిపాలిస్తోంది. ప్రాణాన్ని తీసుకునే సార్వభౌమత్వమే మరణాన్ని జయించింది. విశ్వాసుల్ని పరలోకానికీ, క్రీస్తు వద్దకూ తీసుకొస్తోంది. సాతాను, రోగం, నాశనం, విధి నా జీవితంపై అంతిమ నిర్ణయం తీసుకుంటాయన్న ఆలోచన మధురంగా ఉండదు. అది శుభవార్త కాదు.

దేవుడు పరిపాలిస్తున్నాడన్నదే శుభవార్త. ఎందుకు? దేవుడు పరిశుద్ధుడు, నీతిమంతుడు, మంచివాడు. ఆయన ఖచ్చితంగా జ్ఞానం గలవాడు. “జ్ఞాన శౌర్యములు ఆయన యొద్ద ఉన్నవి. ఆలోచనయు

వివేచనయు ఆయనకు కలవు" (యోబు 12:13). "ఆయన జ్ఞానమునకు మితి లేదు" (కీర్తన 147:5). "ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము" (రోమా 11:33). "పరలోకములో ప్రధానులకును అధికారులకును, సంఘము ద్వారా తన యొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలనన్నదే" ఆయన యొక్క గొప్ప ఉద్దేశం (ఎఫెసీ 3:9).

ఆయనను ఆశ్చర్యపరిచేదీ, అయోమయానికి గురిచేసేదీ, బహిరంగంగా అవమానించేదీ ఏదీ లేదు. ఆయన అనంతమైన శక్తి, తన అనంతమైన పరిశుద్ధత, నీతి, మంచితనం, జ్ఞానం కలిగిన హస్తాల్లో ఆయన యొక్క అనంతమైన శక్తి ఉంది. తన కుమారుడైన యేసుక్రీస్తును నమ్మేవారికి సేవ చేయడానికి అదంతా ఉపయోగ పడుతుంది. పాపుల కోసం మరణించడానికి యేసును దేవుడు పంపించాడు. కరోనా వైరస్‌కు సంబంధించిన ప్రతి విషయమూ దేవుడు క్రీస్తు ద్వారా పాపుల కోసం జరిగించిన కార్యంలో నిక్షిప్తమై ఉంది.

## పాపుల కోసం దేవుడు సమస్తాన్నీ సిద్ధం చేసిన విధానం

ఇదిగో కనెక్షన్ ఇక్కడుంది చూడండి! రోమా 8:32 వచనమే జవాబు: "తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుదీయక మన అందరి కొరకు ఆయనను అప్పగించినవాడు ఆయనతోపాటు

సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు? మన స్థానంలో తన కుమారుణ్ణి సిలువ వేయబడడానికి దేవుడు సంసిద్ధుడయ్యాడు. సమస్తాన్నీ మనకు అనుగ్రహించడానికి తన సార్వభౌమత్వాన్ని తాను ఉపయోగించుకుంటానని దేవుడు చేసిన ప్రకటనే ఈ సంసిద్ధత. "ఆయనతోపాటు సమస్తమును కృపతో మనకు అనుగ్రహించడా?" ఈ ప్రశ్నకు జవాబు: ఆయన తప్పనిసరిగా అనుగ్రహిస్తాడు. తన కుమారుని రక్తమే దానికి హామీ ఇస్తోంది.

ఇక్కడ "సమస్తమును" అంటే ఏమిటి? ఆయన చిత్తాన్ని నెరవేర్చి, ఆయన నామాన్ని ఘనపరిచి, సంతోషకరమైన ఆయన సన్నిధిలోకి సురక్షితంగా చేరుకోవడానికి మనకు అవసరమైన విషయాలివి.

నిజ జీవితంలో అనగా కరోనా వైరస్ ఉన్న పరిస్థితిలో అదెలా పనిచేస్తుందో 3 వచనాల తర్వాత పౌలు వివరిస్తున్నాడు.

> "క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపు వాడెవడు? శ్రమయైనను బాధయైనను హింసయైనను కరవైనను వస్త్రహీనతయైనను ఉపద్రవమైనను ఖడ్గమైనను మనలను ఎడబాపునా? ఇందును గూర్చి వ్రాయబడిన దేమనగా –
>
> నిన్నుబట్టి దినమెల్ల మేము వధింపబడినవారము. వధకు సిద్ధమైన గొర్రెలమని మేము ఎంచబడిన వారము. అయినను మనలను ప్రేమించినవాని ద్వారా

మనము వీటన్నిటిలో ఆత్యధిక విజయము పొందు చున్నాము" (రోమా 8:35-37).

వేదనతో కూడిన అద్భుతమైన ఈ మాటలను విస్మరించకండి! "దినమెల్ల మేమ వధింపబడినవారము." ఆయన తన కుమారుణ్ణే ఉపేక్షించలేదు కాబట్టి దేవుడు మనకు అనుగ్రహించే సమస్త విషయాల్లో మరణం ద్వారా సురక్షితంగా మనల్ని తీసుకురావడం కూడా ఉందని అర్థం. అందువల్లనే రోమా 8:38-39 లలో "మరణమైనను జీవమైనను ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమ నుండి మనలను ఎడబాప నేరవని రూఢిగా నమ్ముతున్నానని" పౌలు చెబుతున్నాడు.

## చెడు నడత వెనుక సాతాను ఉద్దేశం ఏదైనప్పటికీ...

మన శ్రమ, మరణాల వెనుక సాతాను హస్తముండడానికి అవకాశం ఉంది. దేవుడు సాతానుకు ఆ అనుమతి ఇస్తాడు. అయితే సాతాను అంతిమ అధికారి కాదు. దేవుని అనుమతి లేకపోతే, దేవుడు నియమించిన హద్దును దాటి వాడు మనల్ని గాయపరచలేడు (యోబు 1:12; లూకా 22:31; 2కొరింథీ 12:7). చివర్లో యోసేపు ఏ విధంగానైతే తనను బానిసగా అమ్మేసిన తన సోదరులతో "మీరు కీడు చేయనుద్దేశించితిరి గాని నేటి దినము జరుగుచున్నట్లు అనగా బహు ప్రజలను బ్రతికించునట్లుగా అది మేలుకే దేవుడు ఉద్దేశించెను" (ఆది 50:20) అని చెప్పాడో అదే విధంగా మనం సాతానుతో చెప్పడం సబబుగానే ఉంటుంది.

ఈ వచనంలో ఉన్న తీవ్రతను తగ్గించకుండా జాగ్రత్తపడండి. దేవుడు దానిని మేలు కోసం ఉపయోగించుకున్నాడనీ, లేదా దేవుడు దానిని మంచిగా మార్చాడనీ" పై వచనం చెప్పడం లేదు. "మేలుకే దేవుడు ఉద్దేశించాడు" అని చెబుతోంది. దేవునికొక సదుద్దేశం ఉంది. ఈ పాపపు చర్య మధ్యలో కల్పించుకుని దేవుడు దానిని శుభ్రం చేయడం మొదలుపెట్టలేదు. ఆరంభం నుంచే ఆ కార్యం వెనుక ఒక ఉద్దేశమూ, ప్రణాళికా ఉంది. ప్రారంభం నుంచే ఆయన దానిని మేలు కోసం సంకల్పించాడు.

మనుషుల యొక్క సాతాను దుశ్చర్యలు మన శ్రమలను రెట్టింపు చేసినప్పుడు ఇదే మన ఆదరణకు కీలకమైనది. సాతానుతో గానీ, దుష్టులతో గానీ "నువ్వు కీడు చేయనుద్దేశించావు. అది దేవుడు మేలుకే ఉద్దేశించాడు" అని చెప్పే హక్కు క్రీస్తులో మనకుంది. సాతాను గానీ, వ్యాధి గానీ, పాపియైన మనిషి గానీ సార్వభౌములు కారు. కేవలం దేవుడు మాత్రమే సార్వభౌముడు. అంతేకాదు, ఆయన మంచివాడు, జ్ఞాని.

## పిచ్చుకైనా, తల వెంట్రుకైనా నేల రాలదు

లేఖనాల్లో ఇతర భక్తుల మాదిరిగానే యేసు కూడా దేవుని సార్వభౌమత్వంలోని మాధుర్యాన్ని తన శిష్యులకు ఇలా వివరిస్తున్నాడు,

"రెండు పిచ్చుకలు కాసుకు అమ్మబడును గదా;
అయినను మీ తండ్రి సెలవులేక వాటిలో ఒకటైనను

నేలను పడదు. మీ తల వెంట్రుకలన్నియు లెక్కింపబడి యున్నవి గనుక మీరు భయపడకుడి. మీరనేకమైన పిచ్చుకల కంటే శ్రేష్ఠులు" (మత్తయి 10:29–31).

దేవుని ప్రణాళిక లేకపోతే ఒక పిచ్చుక కూడా నేల రాలదు. దేవుని ప్రణాళిక లేకుండా ఒక్క వైరస్ కూడా చలించదు. ఇదే సార్వభౌమత్వమంటే! యేసు తర్వాత ఏమి చెప్పాడు? మూడు విషయాలు: అనేక పిచ్చుకలకంటే మీరు శ్రేష్ఠులు; మీ తల వెంట్రుకలన్నియు లెక్కించబడ్డాయి; భయపడవద్దు.

ఎందుకు భయపడకూడదు? ఎందుకంటే మనం జీవించినా, మరణించినా దేవుని సార్వభౌమత్వమే ఆయన యొక్క పరిశుద్ధతనూ, నీతినీ, మంచితనాన్నీ, జ్ఞానాన్నీ సేవిస్తుంది. క్రీస్తులో మనం ఆయన కోసం ప్రాణం పెట్టాల్సిన భటులం కాదు. ఆయనకు చాలా ప్రియమైన పిల్లలం. "మీరనేకమైన పిచ్చుకల కంటే శ్రేష్ఠులు."

ఇదే ఇంతకుముందు నేను ప్రస్తావించిన రహస్యం: కరోనా వైరస్‌ను ఆపగలిగే సార్వభౌమత్వమే దానిని కొనసాగిస్తోందని ఎరగడం. దేవుడు కరోనా వైరస్‌ను కొనసాగించడమే కాదు, తనను ప్రేమించేవారికి క్రీస్తునందు పిలువబడినవారికి మేలుచేయడం కోసం సమస్తాన్నీ, అది చేదైనా మధురమైనా సమకూర్చి జరిగిస్తున్నాడు (రోమా 8:28–30).

## నా పని పూర్తయ్యే వరకు నేను అమర్త్యుణ్ణి

రెండు వేల సంవత్సరాలుగా క్రీస్తు యొక్క ప్రజల్ని మరణ సమయంలో ధైర్యపరచింది అలాంటి స్థిరమైన నమ్మకమే. వేలాదిమంది క్రైస్తవులు ప్రేమతో చేస్తున్న త్యాగాలను స్థిరపరిచే శక్తి జ్ఞానయుక్తమైన మంచిదైన దేవుని సార్వభౌమత్వమనే సత్యం.

ఉదాహరణకు, భారతదేశానికీ, పర్షియాకూ మిషనెరీగా వెళ్ళిన హెన్రీ మార్టిన్ 31 సంవత్సరాల వయస్సులో (అక్టోబర్ 6, 1812) ప్లేగు వ్యాధి (కరోనా వైరస్ వంటిదే) వలన మరణించాడు. 1812 వ సంవత్సరం జనవరిలో తన జర్నల్‌లో ఇలా రాశాడు,

> "ఇంతకు ముందు నేను చూసిన సంవత్సరాలన్నింటి కంటే ఈ సంవత్సరం విపత్కరమైనదిగా కనిపిస్తోంది. అయితే పర్షియా భాషలో కొత్త నిబంధనను పూర్తి చేసేవరకు నేను జీవిస్తే, దాని తర్వాత నా జీవితానికి అంత ప్రాముఖ్యత ఉండదు. అయితే నేను జీవించినా, మరణించినా నాలో క్రీస్తు ఘనపరచబడతాడు! ఆయన నిమిత్తం నేను చేయాల్సిన పని మిగిలి ఉంటే నేను మరణించే అవకాశమే లేదు."[2]

తరచుగా పై మాటలను ఇలా చెబుతుంటారు, "క్రీస్తు నిమిత్తం నేను చేయాల్సిన పని ముగిసేవరకు నేను అమర్త్యుణ్ణే." ఇదెంతో

గంభీరమైన సత్యం. సార్వభౌముడైన మన దేవుని హస్తాల్లోనే జీవ మరణాలున్నాయనే వాస్తవంపై ఈ మాట ఆధారపడి ఉంది. నిజానికి క్రీస్తు యొక్క అతిశయమంతా ఆయన చేతిలోనే ఉంది. 24 సంవత్సరాల వయసులో, అంటే మార్టిన్ మరణించడానికి 7 సంవత్సరాల ముందు ఇలా రాశాడు,

> "ఈ విశ్వానికి దేవుడే సార్వభౌముడు కాకపోయి ఉంటే, నేనెంతో దౌర్భాగ్యుణ్ణి అయ్యుండేవాణ్ణి! అయితే యెహోవా రాజ్యపాలన చేస్తున్నాడు. భూలోకము ఆనందించును గాక. క్రీస్తు ఆశయమే గెలుస్తుంది. ఓ నా ప్రాణమా, ఈ సత్యమునందు సంతోషించు."[3]

# భాగం 2:

# కరోనా వైరస్ ద్వారా దేవుడేం చేస్తున్నాడు?

# చూడడం, చూపించడం గురించిన తొలి తలంపులు

దేవుడు సింహాసన భ్రష్టుడు గావించబడకపోతే, నిజానికి ఆయనే సమస్తాన్ని తన చిత్తానుసారంగా చేసిన నిర్ణయం చొప్పున జరిగిస్తూ ఉంటే (ఎఫెసీ 1:11) ఈ కరోనా వైరస్ విజృంభణ, అది కలిగించే వినాశనం దేవుని పరిశుద్ధమైన నీతిగల మంచిదైన జ్ఞానం కలిగిన హస్తాల్లోనే ఉంటే ఆయన ఇప్పుడు ఏం చేస్తున్నాడు? ఆయన ఉద్దేశాలేమిటి?

## మనిషి గురించి ఆలోచించడం ఆపండి

పై ప్రశ్నకు జవాబు చెప్పడానికి ప్రయత్నం చేయకముందే చెప్పాల్సిన విషయం. దేవుని జ్ఞానంతో పోలిస్తే మీ, నా అభిప్రాయాలు వ్యర్థమైనవి. మనం మనస్సుల్లో ఆలోచించేవన్నీ ప్రాముఖ్యత లేనివి. "తన మనస్సును నమ్ముకొనువాడు బుద్ధిహీనుడు" అని బైబిల్ చెబుతోంది (సామెతలు 28:26). అయితే "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవా యందు నమ్మక ముంచుము" అని మనకు చెప్పబడింది (సామెతలు 3:5).

మనుషులమైన మనం పరిమితులున్నవాళ్ళం, పాపులం. మన చుట్టుప్రక్కల ఉన్న సంస్కృతికి అలవడినవాళ్ళం. జన్యువులను బట్టీ,

వ్యక్తిగత చరిత్రలనుబట్టీ మలచబడినవాళ్ళం (చెడినవాళ్ళం). మన అభిరుచులనూ, ప్రాధాన్యతలనూ సమర్థించుకోవడానికే మన హృదయాలూ, మనస్సులూ, నోళ్ళూ పనిచేస్తుంటాయి. అందువల్ల ప్రవక్త యెషయా చెప్పిన మాటల్ని ఆలకించడం జ్ఞానయుక్తమైన పని. “తన నాసికారంధ్రములలో ప్రాణము కలిగిన నరుని లక్ష్యపెట్టకుము; వానిని ఏ విషయములో ఎన్నిక చేయవచ్చును?” (యెషయా 2:22).

అలా అయితే ఈ పుస్తకాన్ని రాయడమూ, ఈ భాగానికి “కరోనా వైరస్ ద్వారా దేవుడు ఏమి చేస్తున్నాడు?” అనే శీర్షిక పెట్టడమూ అహంకారం కాదా?

ఇది అహంకారం కానే కాదు. క్రైస్తవ లేఖనాల్లో దేవుడు మాట్లాడింది నిజం కాబట్టీ, మనం ఆయననూ ఆయన మార్గాలనూ నిజంగా, పాక్షికంగా తెలుసుకొనే విధంగా మనుషులు ఉపయోగించే మాటలను మాట్లాడేలా దేవుడు తనను తాను తగ్గించుకున్నాడు కాబట్టీ “(దేవుడు) మనకు సంపూర్ణమైన జ్ఞాన వివేచన కలుగుటకు, ఆ కృపను మన యెడల విస్తరింపజేసెను” (ఎఫెసీ 1:9) అని పౌలు చెప్పిన మాటలు సత్యం కాబట్టీ, మీరు దానిని చదివిన యెడల దానినిబట్టి ఆ క్రీస్తు మర్మమును గూర్చి నాకు కలిగిన జ్ఞానము గ్రహించుకొనగలరు (ఎఫెసీ 3:4) అని పౌలు చెబుతున్నాడు. కాబట్టే నేను ఈ పుస్తకం రాయడం అహంకారపూరిత చర్య కాదు.

ఈ లోకంలో దేవుడు తాను చేస్తున్న కార్యం గురించి మౌనంగా లేడు. ఆయన మనకు లేఖనాలను అనుగ్రహించాడు. బైబిల్‌ని దేవుని వాక్యంగా మనం నమ్మవచ్చు అనడానికి కొన్ని కారణాలను నేను 2వ అధ్యాయంలో తెలియజేశాను. దేవుడు చేస్తున్న కార్యం గురించి ఏదో కొత్త విషయం చెప్పడం నా లక్ష్యం కాదు. లేఖనాల్లో ఆయన మాటను విని, నేను విన్నదానిని మీరు కూడా వినేలా ప్రోత్సహించడమే నా లక్ష్యం.

## ఆయన మార్గములెంత నిగూఢమైనవి

దేవుడేమి చేస్తున్నాడు? అనే ప్రశ్నకు జవాబు చెప్పడానికి ముందే నేనింకొక విషయాన్ని చెప్పాల్సి ఉంది. మనకు తెలియని విస్తారమైన కార్యాలను ఆయన చేస్తున్నాడన్నదే ఆ మాట.

> *"యెహోవా, నా దేవా, నీవు మా యెడల జరిగించిన ఆశ్చర్య క్రియలును మా యెడల నీకున్న తలంపులును బహు విస్తారములు. వాటిని వివరించి చెప్పెదననుకొంటినా అవి లెక్కకు మించియున్నవి. నీకు సాటియైన వాడొకడును లేడు"* (కీర్తన 40:5).

కరోనా వైరస్ విషయంలో ఆయన ప్రణాళికలు లెక్కకు మించడమే కాదు; చాలా విధాలుగా అవి మన జ్ఞానానికి అతీతమైనవి. "ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము;

ఆయన తీర్పులు శోధింపనెంతో అశక్యములు; ఆయన మార్గములెంతో అగమ్యములు" (రోమా 11:33). అయితే ఈ మాటలు చెబుతూ, "కాబట్టి మీ బైబిల్ మూసేసి, మీరే మీ భవిష్యత్తును ఎదుర్కోండి" అని పౌలు అనడం లేదు.

దానికి భిన్నంగా 11 అధ్యాయాల్లో వివరించి, ముగింపులో దేవుని యొక్క శోధింపశక్యమైన మార్గాల గురించి పౌలు రాశాడు. ఈ మాటలన్నింటినీ మనం అర్థం చేసుకోవాలనే అతడిలా రాశాడు. ఉదాహరణకు,

> *"అంతేకాదు, శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయునని యెరిగి శ్రమ యందును అతిశయపడుదము. ఎందుకనగా ఈ నిరీక్షణ మనలను సిగ్గుపరచదు. మనకు అనుగ్రహించబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింప బడి యున్నది"* (రోమా 5:3-5).

దేవుడు వెల్లడి చేసిన విషయాలను మనం తెలుసుకోవాలనే లేఖనాలను ఆయన రాయించాడు. మరి ముఖ్యంగా శ్రమల గురించి తెలుసుకోవాలని! ఈ శ్రమల్లో కరోనా వైరస్ సృష్టిస్తున్న అల్లకల్లోలం కూడా ఉంది. "శోధింపనశక్యమైన" అంటే "మనం చూడగలిగిన దానికంటే ఎక్కువగానే దేవుడు అన్ని సమయాల్లోనూ పనిచేస్తుంటాడు" అని అర్థం. చివరికి మనం చూడగలిగింది కూడా ఆయన వెల్లడి చేయకపోయినట్లయితే చూసి ఉండేవాళ్ళం కాదు.

## వాస్తవాన్ని చూపించడం

John Lennon రాసిన ప్రముఖ గీతంలో ఊహలున్నట్లు, ఊహించడం ఇక్కడ నా పని కాదు.[4] పరలోకం లేదు, పాతాళం లేదు. కేవలం ఆకాశం మాత్రమే ఉన్నదని జాన్ లెనన్ మనతో చెబుతున్నాడు. అలా ఊహించడం సులభమేనని అతడు అంటున్నాడు. నిజమే, సులభమే, చాలా సులభమే! కరోనా వైరస్ సులభమైన ఊహల్ని కాదు, కఠినమైన వాస్తవాన్ని డిమాండ్ చేస్తుంది. మనకు అవసరమైన వాస్తవం దేవుడు, ఆయన వాక్యమూ! దేవుని వాక్యమే మన కాళ్ళ క్రింద బండ. అందువల్ల వాస్తవాన్ని సృష్టించడం కాదు, వాస్తవాన్ని చూపించడమే ఇక్కడ నా లక్ష్యం. దేవుడు చెప్పింది వినడం, వేరే ఏమీ ఊహించకుండా ఆ వాక్యాన్ని అంగీకరించడం నా లక్ష్యం.

బైబిల్ ఏమి బోధిస్తుందో చూపించి ఆ తర్వాత కరోనా వైరస్ ఉన్న ఈ సమయానికి దానిని అన్వయిస్తాను. సరైనదేదో వివేచించడం మీ విధి.

ప్రస్తుత సమయానికి అర్థం చెప్పడం గురించి యేసు అదే చెప్పాడు కాబట్టే ఇలా మాట్లాడుతున్నాను. ప్రజలు వాతావరణంలో మార్పుల్ని గుర్తించడానికే కాని చరిత్రలో దేవుని కార్యాన్ని గుర్తించడానికి మాత్రం జ్ఞానాన్ని ఉపయోగించడం లేదని యేసు ఆగ్రహం వ్యక్తం చేశాడు,

> *"వేషధారులారా, మీరు భూమ్యాకాశముల వైఖరి గుర్తింపనెరుగుదురు; ఈ కాలమును మీరు గుర్తింప నెరుగరేల? ఏది న్యాయమో మీ అంతట మీరు విమర్శింపరేల"* (లూకా 12:56–57).

మీరు దేవుని సహాయాన్ని అడిగి, దేవుని వాక్యం వైపు చూసి, ఏది న్యాయమో దేవుడు మీరే నిర్ధారించుకుంటారని నా ఆశ. నేను చెప్పేదానిని మీరు లేఖనాలతో పరీక్షిస్తారనీ (1యోహాను 4:1), మేలైన దానిని చేపడతారని నేను ఆశిస్తున్నాను (1థెస్స 5:21).

## అనుసరించాల్సిన ఆరు మార్గాలు

కరోనా వైరస్ ద్వారా దేవుడు ఏం చేస్తున్నాడు? అనే ప్రశ్నకు నేను ఆరు జవాబులు చెప్పబోతున్నాను. ప్రతీ జవాబును వివరించడానికి ఎన్నో పేజీలు రాయవచ్చు. అయితే ప్రస్తుత సంక్షోభ సమయాన్ని దృష్టిలో పెట్టుకుని నేను విస్తారంగా రాయదలచుకోవడం లేదు. వాక్యంలో సత్యాన్ని మాత్రమే నేను మీకు చూపిస్తాను. ఈ పుస్తకాన్ని చదవడం ముగించాక మీరు వాటిని అన్వేషించండి. అదే నా ఆశ. ఆ మార్గాల్లో మనం కలిసి నడిస్తే బాగుంటుందనే కోరిక నాకుంది. అయితే ఆ బాధ్యతను మీకే విడిచిపెడుతున్నాను. దేవుడే మిమ్మల్ని నడిపించును గాక!

దేవుడు కరోనా వైరస్ ద్వారా ఏం చేస్తున్నాడు?

# అధ్యాయం 6

# నైతిక భీతిని చిత్రిస్తున్నాడు

## మొదటి జవాబు

*అన్ని ఉపద్రవాలలో మాదిరిగానే కరోనా వైరస్ వ్యాప్తిలో కూడా దేవుడు లోకానికి నైతిక భీతి యొక్క భౌతిక చిత్రాన్నీ, దేవుణ్ణి అల్పునిగా చేయడమనేది ఒక వికృతమైన ఆధ్యాత్మిక పాపమనీ చూపిస్తున్నాడు.*

భౌతికమైన దుఃఖమంతటికీ ఉనికినిచ్చింది పాపమే. లోకంలోకి పాపం ఎలా ప్రవేశించిందో ఆదికాండము 3వ అధ్యాయం వర్ణిస్తోంది. ప్రపంచవ్యాప్తమైన వినాశనానికీ దుఃఖానికీ మూలం పాపమేనని ఈ అధ్యాయం చూపిస్తోంది (ఆది 3:1–19). రోమా 5:12 లో పౌలు దాని సారాంశాన్ని క్లుప్తంగా రాశాడు. "ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరూ పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను."

అప్పటినుంచే లోకం ముక్కలయ్యింది. లోక సౌందర్యంతోపాటు దుష్టత్వం, వైపరీత్యాలు, వ్యాధులు, విసుగు మొదలైనవి మిళితమై పోయాయి. దేవుడు లోకాన్ని పరిపూర్ణమైనదిగా సృష్టించాడు. “దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాలా మంచిదిగా ఉండెను” (ఆది 1:31). అయితే మానవజాతి పాపంలోనికి పడిపోయిన నాటి నుంచి ఇప్పటివరకు పరిస్థితులు అదుపు తప్పాయి, అస్తవ్యస్థంగా తయారయ్యాయి.

## పతనమే తీర్పుకు కారణం

పాపంతో నిండిపోయిన లోకంలో ఈ దుస్థితి సహజమైనదని కాక, దేవుని తీర్పు అని బైబిల్ చెబుతోంది. పాపం మూలంగా దేవుని తీర్పు యొక్క ఫలితాలను పౌలు ఇలా వివరించాడు,

> *“ఏలయనగా సృష్టి నాశనమునకు లోనయిన దాస్యములో నుండి విడిపింపబడి, దేవుని పిల్లలు పొందబోవు మహిమ గల స్వాతంత్ర్యము పొందుదునను నిరీక్షణ గలదై స్వేచ్ఛగా కాక దానిని లోపరచిన వాని మూలముగా వ్యర్థ పరచబడెను. సృష్టి యావత్తు ఇదివరకు ఏకగ్రీవముగా మూలుగుచు ప్రసవ వేదన పడుచున్నదని యెరుగుదుము”* (రోమా 8:20-22).

వ్యర్థత, నాశనానికి లోనైన దాస్యం, మూలుగులు. పాపం లోకంలోనికి ప్రవేశించిన నాటినుండి ప్రపంచంలోని వినాశనాన్ని, దుఃఖాన్ని చూపించే చిత్రాలివే. ఈ వినాశనానికి కారణం దేవుని తీర్పేనని పౌలు చెబుతున్నాడు. సృష్టి తనను నిరీక్షణకు లోపరచిన వాని మూలంగానే నాశనానికి లోనయ్యింది (8:20). దానిని నిరీక్షణకు లోపరచినవాడు సాతాను కాదు, ఆదాము కూడా కాదు, కానీ దేవుడే! "తీర్పు ఒక్క అపరాధ మూలంగా వచ్చినదై శిక్షా విధికి కారణమాయెను" అని రోమా 5:16 లో పౌలు చెప్పాడు.

## ఆయన బిడ్డలు కూడా తీర్పుకు గురయ్యారు

ఈ వాక్యభాగం సంపూర్ణ నిరీక్షణతో నిండి ఉంది. "దేవుని పిల్లలు పొందబోవు మహిమ గల స్వాతంత్ర్యము" (రోమా 8:21) అనే మాటలో ఆ సందేశం కనబడుతోంది. నూతన సృష్టి యెడల దేవునికొక అద్భుతమైన ప్రణాళిక ఉంది. ఆ నూతన సృష్టిలో దేవుడు తన ప్రజల ప్రతీ కన్నీటి బిందువునూ తుడిచివేస్తాడు (ప్రకటన 21:4). అయితే ఇప్పుడు మాత్రం మనందరం ఆయన తీర్పు కింద ఉన్నాం. లోకాన్ని మరణానికీ, వైపరిత్యానికీ, దుఃఖానికీ ఆయన అప్పగించాడు.

అవును, దత్తపుత్రులుగా తాను ముందుగా నిర్ణయించుకున్న తన పిల్లలను సైతం (ఎఫెసీ 1:5) తన కుమారుని రక్తంచేత విమోచించు కున్న వారిని (ఎఫెసీ 1:7) నిత్యజీవానికి నిర్ణయించబడిన వారిని (ఎఫెసీ

1:18) కూడా ఆయన శ్రమకూ, మరణానికీ అప్పగించాడు. ఆదాము పతనం మూలంగా కలిగిన దేవుని తీర్పును మనం కూడా అనుభవిస్తున్నాం. “అంతేకాదు, ఆత్మ యొక్క ప్రథమ ఫలముల నొందిన మనము కూడ దత్తపుత్రత్వము కొరకు అనగా మన దేహము యొక్క విమోచనము కొరకు కనిపెట్టుచు మనలో మనము మూలుగు చున్నాము” (రోమా 8:23). సునామీల్లో క్రైస్తవులు తుడిచిపెట్టుకు పోతున్నారు, ఉగ్రవాదుల దాడుల్లో హతమార్చబడు తున్నారు. కరోనా వైరస్ వ్యాధికి గురవుతున్నారు.

## శిక్ష కాదు, శుద్ధి

క్రీస్తును పెన్నిధిగా హత్తుకున్న క్రైస్తవులమైన మనం ఈ దుస్థితిని ఎదుర్కోవడం శిక్షావిధిలో భాగం కాదు. “ఇప్పుడు క్రీస్తునందున్న యెడల వారికి ఏ శిక్షా విధియు లేదు” (రోమా 8:1). మనకు కలిగే బాధ మనల్ని శిక్షించడం కోసం కాదు, మనల్ని పవిత్రపరచడం కోసం.

దేవుడు మనల్ని ఉగ్రత కోసం నియమించలేదు (1థెస్స 5:9). మనుషులందరి మాదిరిగానే మనం కూడా వ్యాధుల చేత, వైపరీత్యాల్లోనూ మరణిస్తాం. అయితే క్రీస్తులో ఉన్నవారి విషయంలో మరణపు ముల్లు విరిచివేయబడింది (1కొరింథీ 15:55). అందువల్ల క్రైస్తవులకు “మరణం మేలు చేస్తుంది” (ఫిలిప్పీ 1:21). ఇక్కడినుంచి వెళ్ళిపోవడమంటే “క్రీస్తులో ఉండడమే” (ఫిలిప్పీ 1:23).

## సాతాను నిజంగా ఉన్నవాడే, కానీ నిర్బంధించబడినవాడు

ఈ లోకంలోని విషాదాలకు దేవుని తీర్పును మూలంగా ఎంచుతూ లోకమంతా ఉన్న ఈ బాధల్లో సాతాను ప్రమేయం కూడా ఉన్నదనే వాస్తవానికి నేను నా కళ్లు మూసుకోలేదు. ఈ యుగ సంబంధమైన దేవత అనీ (2కొరింథీ 4:4), ఈ లోకాధికారి అనీ (యోహాను 12:31), వాయుమండల సంబంధమైన అధిపతి (ఎఫెసీ 2:2) అనీ బైబిల్ వాణ్ణి పేర్కొంటుంది. వాడు ఆరంభం నుంచే హంతకునిగా ఉన్నాడు (యోహాను 8:44). అనేక రకాలైన వ్యాధులతో మనుషుల్ని వాడు బంధిస్తాడు, బాధిస్తాడు (లూకా 13:16; అపొ.కా. 10:38).

అయితే సాతాను మెడ చుట్టూ ఒక పాశం ఉంది. అది దేవుని చేతిలోనే ఉంది. దేవుని అనుమతి లేకుండా వాడు పనిచేయడు. దేవుడిచ్చిన అనుమతితోనే, ఆయన నియమించిన హద్దుల్లోనే వాడు పనిచేస్తాడు (యోబు 1:12; 2:6; లూకా 22:31; 2కొరింథీ 12:7). సాతాను ఎంతవరకు నష్టం చేయాలో అంతిమంగా నిర్ణయించేది దేవుడే. దేవుని తీర్పుకు వాడు అతీతుడు కాడు. వాడికి తెలియకుండానే వాడు దేవునికి పరిచర్య చేస్తున్నాడు.

## కీలకమైన ప్రశ్న

కరోనా వైరస్ యొక్క అర్థాన్ని, మరింత ప్రస్ఫుటంగా చూపించే ప్రశ్న ఇప్పుడు ఇక్కడ ఉంది. నైతికమైన దుష్టత్వం నిమిత్తం ఈ

లోకంపై భౌతికమైన తీర్పును దేవుడెందుకు రానిస్తాడు? ఆదాము హవ్వలు దేవుణ్ణి తృణీకరించారు, వారి హృదయాలు దేవునికి విరోధంగా మారిపోయాయి. ఆయన జ్ఞానం కంటే వాళ్ళు తమ జ్ఞానానికే ప్రాధాన్యతనిచ్చారు. దేవుణ్ణి నమ్మడానికి బదులు ఆయన నుంచి స్వాతంత్ర్యాన్ని వాళ్ళు ఎంచుకున్నారు. పాపం మొదట దేహంలో కాదు, ఆత్మలో జరిగింది. పాపం మొదట జరిగింది మనుషుల విషయంలో కాదు, దేవుని విషయంలో!

నైతికమైన, ఆత్మ సంబంధమైన తిరుగుబాటుకు శిక్షగా దేవుడు భౌతికమైన లోకాన్ని వైపరీత్యాలకూ, దుఃఖానికీ అప్పగించాడు. ఎందుకు? మానవ ఆత్మలోనే పాపం మొదలయ్యింది. కాబట్టి దానిపైనే శిక్ష వేసి భౌతిక ప్రపంచాన్ని మంచి క్రమంలో ఎందుకు విడిచిపెట్ట కూడదు?

**జవాబు**

మన చుట్టూ ఉన్న వ్యాధుల్లోనూ, వైపరీత్యాల్లోనూ మనం చూస్తూ ఉన్న భౌతికమైన, భయానకమైన సంగతులు పాపం ఎంత ఘోరమైనదో అనేదానికి స్పష్టమైన రుజువుగా ఉండాలని దేవుడు భౌతిక ప్రపంచాన్ని శపించాడు. మరొకరీతిగా చెప్పాలంటే, దేవునికి వ్యతిరేకంగా మనుషులు నైతికంగా చేసిన తిరుగుబాటుకు ఈ భౌతిక ప్రపంచం ఒక ఉపమానంలా, ఒక నాటకంలా, ఒక సూచికలా పనిచేస్తోంది.

ఇదెలా సమంజసం అవుతుంది? పతనం తర్వాత మనం పాపం చేత అంధులమయ్యాం కనుక పాపం అనేది దేవునికెంత ఆయాసకరమైనదో మనం చూడలేము, గ్రహించలేము. దేవునికి కాకుండా వేరే వాటికి ప్రాధాన్యత నివ్వడం ఎంత భయంకరమైన విషయమో లోకంలో దాదాపు ఎవ్వరూ గ్రహించడం లేదు. అనుదినమూ దేవుణ్ణి నిర్లక్ష్యం చేస్తూ, తిరస్కరిస్తూ ఆయనను అల్పునిగా పరిగణిస్తున్నందుకు ఎవరైనా ఎందుకు నిద్ర పోగొట్టుకుంటారు?

భౌతికంగా మనం అనుభవించే నొప్పి ఎంత వేదనకరంగా ఉంటుందో కదా! దేవుడు మన దేహాలను తాకితే మనకెంత తీవ్రమైన కోపం తెప్పిస్తుందో కదా! మన హృదయాల్లో అనుదినమూ దేవుణ్ణి అవమానించే విధానం నిమిత్తం మనం విలపించకపోవచ్చు. అయితే కరోనా వైరస్ వచ్చి మన దేహాలపై దాడి చేస్తే అప్పుడు ఆయన మనకు గుర్తొస్తాడు. లోకంలో ఏదో భయంకరమైన విషయం ఉందని మనకు తెలియజేసే దేవుని బూర శబ్దమే భౌతికమైన నొప్పి, వేదన. ఆధ్యాత్మిక ప్రపంచంలో పాపం ఎలాంటిదో భౌతిక ప్రపంచంలో వ్యాధి బాధలనేవి అలాంటివే. అవి దేవుడు గీసిన చిత్రాలు.

ఈ లోకంలో అత్యంత భక్తిపరులైన వ్యక్తులకు కూడా వ్యాధులూ, వైకల్యాలూ సోకుతున్నాయనేది నిజం. పాపం దేనికి పాత్రురాలో, దేనికి తగినదో అనే విషయాన్ని దేవుడు ఉపద్రవాల ద్వారా చూపు తున్నాడు. ఒకానొక దినాన జరిగే తీర్పులో వెయ్యి రెట్లు దారుణ మైన శిక్షను మనుషులు పొందుకుంటారు. అవి హెచ్చరికలు. దేవునికి

విరుద్ధంగా జరుగుతున్న నైతిక భ్రష్టత్వాన్నీ, పాపం యొక్క వికృత రూపాన్నీ చూడడానికి ఇవి మేల్కొలుపులు.

మనల్ని సృష్టించిన వాణ్ణి ఏహ్యాభావంతో చూడడం, ఆయనను విస్మరించడం, నమ్మకపోవడం, అవమానించడం, మన హెయిర్ స్టయిల్‌కి ఇచ్చే ప్రాధాన్యత కంటే మన హృదయాల్లో ఆయనకు తక్కువ ప్రాధాన్యత నివ్వడం ఎంత అసహ్యకరమైనదో, ప్రమాదకరమైనదో, హేయమైనదో మనం ఈ లోకంలోని శ్రమల ద్వారా మనందరం చూడగలగాలి, గ్రహించగలగాలి.

మనం దీనిని చూడాలి, అనుభూతి చెందాలి. లేదంటే పాపం యొక్క వికారమైన రూపం నుంచి తొలగిపోయి రక్షణ కోసం క్రీస్తు వైపు తిరగము... పాపం మూలంగా కలిగే శిక్ష నుంచి తప్పించు కోవడానికి మనం మొరపెట్టవచ్చేమో. అయితే దేవుణ్ణి అవమానించే పాపం యొక్క నైతిక వికారతను చూసి మనం ద్వేషిస్తామా, లేదా? ఒకవేళ ద్వేషించకపోతే అది దేవుడు కరోనా వైరస్ లాంటి భౌతికమైన శ్రమల ద్వారా స్పష్టంగా ఆధారాలను సమకూర్చనందుకు కాదు.

# అధ్యాయం 7

# కొన్ని ప్రత్యేకమైన దైవ తీర్పులు పంపిస్తున్నాడు

## రెండవ జవాబు

*కొందరు ప్రజలు తమ పాపపు వైఖరులను బట్టీ, చర్యలను బట్టీ దేవుని తీర్పుగా కరోనా వైరస్ బారిన పడబోతున్నారు.*

దుఃఖమంతటికీ కారణం పతనమే. లోకం లోనికి దేవుణ్ణి అవమానపరిచే పాపపు ప్రవేశ ఫలితమే. అయితే మనుషులు అనుభవించే శ్రమలన్నింటికీ వ్యక్తిగతంగా వాళ్ళు చేసిన కొన్ని ప్రత్యేకమైన పాపాలే అనేది నిజం కాదు. ఉదాహరణకు, యోబుకు ఎదురైన శ్రమలు అతడు చేసిన పాపాల మూలంగా కలిగినది కాదు. యోబు గ్రంథంలోని మొట్టమొదటి మాట ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. "యోబు.... యథార్థవర్తనుడు, న్యాయవంతుడునై దేవుని యందు భయభక్తులు కలిగి చెడుతనమును విసర్జించినవాడు" (యోబు 1:1).

దేవుని తీర్పు వలన కలిగే పలు విధాలైన భౌతిక దుష్పరిణామాలను దేవుని సొంత ప్రజలు కూడా ఎదుర్కొంటారు. అపొస్తలుడైన పేతురు ఇలా రాశాడు,

> "తీర్పు దేవుని ఇంటి యొద్ద ఆరంభమగు కాలము వచ్చి యున్నది; అది మన యొద్దనే ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైనవారి గతి ఏమవును? మరియు నీతిమంతుడే రక్షింప బడుట దుర్లభమైతే భక్తిహీనుడును పాపియు ఎక్కడ నిలుతురు?" (1పేతురు 4:17-18).

దేవుని ఇంటివారికి ఈ తీర్పు శుద్ధి చేసేదే గాని శిక్షించేది కాదు. అందువల్ల శ్రమ అంతటికీ కొన్ని పాపాలపై దేవుడు పంపించిన తీర్పులే కారణం కాదు. అయితే తనను తృణీకరించే వారిపై, తమను తాము పాపానికి అప్పగించుకునే వారిపై దేవుడు కొన్నిసార్లు కొన్ని రకాల వ్యాధుల్ని పంపిస్తాడు.

## పాపాల మూలంగా కలిగిన తీర్పులకు ఉదాహరణలు

కొన్ని ప్రత్యేకమైన పాపాలకు దేవుడిచ్చిన తీర్పులకు నేను రెండు ఉదాహరణలిస్తాను. అపొ.కా. 12వ అధ్యాయంలో హేరోదు రాజు తనను తాను దేవుడని పిలిపించుకోవడానికి అనుమతించి తనను తాను హెచ్చించుకున్నాడు. "అతడు దేవుని మహిమపరచనందున వెంటనే ప్రభువు దూత అతని మొత్తెను గనుక అతడు పురుగులు పడి ప్రాణము విడిచెను" (అపొ.కా. 12:23). తమను తాము హెచ్చించు కునే వాళ్ళందరికీ దేవుడు అదే విధంగా చేయగలడు. "దేవుని ముందు, మనుషుల ముందు తమ అహంకారాన్నిబట్టి మన పరిపాలకుల్లో ఎక్కువమంది ప్రతీరోజూ హఠాన్మరణం పొందనందుకు మనం ఆశ్చర్యపోవాలి." దేవుడలా శిక్షించకపోవడం మహా కనికరమే.

మరొక ఉదాహరణ: స్వలింగ సంపర్కమనే పాపం. రోమా 1:27 లో అపొస్తలుడైన పౌలు ఇలా అంటున్నాడు, “అటువలె పురుషులు కూడ స్త్రీ యొక్క స్వాభావికమైన ధర్మమును విడిచి, పురుషులతో పురుషులు అవాచ్యమైనది చేయుచు తమ తప్పిదమునకు తగిన ప్రతిఫలము పొందుచు ఒకరి యెడల ఒకరు కామతప్తులైరి.” తమ పాపాల్లో తాము వదిలివేయబడడమే తమ పాపానికి “తగిన ప్రతిఫలం.”

దేవుని తీర్పుకు ఈ తగిన ప్రతిఫలమనేది కేవలం ఒక్క ఉదాహరణ. దానిని మనం రోమా 1:18 లో చూస్తున్నాం. “దుర్నీతి చేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనత మీదను, దుర్నీతి మీదను దేవుని కోపము పరలోకము నుండి బయలుపరచబడు చున్నది.” అందువల్ల శ్రమలన్నీ పాపాలకు దేవుడు వేసిన శిక్షలే కాకపోవచ్చు. అయితే కొన్ని అలా అయ్యే అవకాశముంది.

## ఎవరి అంతరంగాన్ని వాళ్ళు పరీక్షించుకోవాలి

ఎవరో వ్యక్తి పైన శిక్షగా కరోనా వైరస్ రాలేదనే విషయం సుస్పష్టం. క్రీస్తు ద్వారా పాప క్షమాపణ పొందిన అత్యంత ప్రేమగల ఆత్మపూర్ణుడైన క్రైస్తవుడు కూడా కరోనా వైరస్ వ్యాధితో మరణించే అవకాశముంది. అయితే మన శ్రమ, మన జీవన విధానాన్నిబట్టి దేవుని శిక్ష వలన కలిగిందో, లేదో వివేచించడానికి మనలో ప్రతీ ఒక్కరం మన హృదయాన్ని పరిశోధించుకోవడం మంచిది.

మనం క్రీస్తు దగ్గరకు వచ్చిన వారమైతే, మనకు కలిగిన శ్రమ దేవుని తీర్పు మూలంగా కలిగిన శిక్ష కాదని నిర్థారించుకోవచ్చు. ఎందుకంటే యేసు ఇలా చెప్పాడు, "నా మాట విని నన్ను పంపినవాని యందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడు" (యోహాను 5:24). క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షా విధియు లేదు (రోమా 8:1). ఇది క్రమశిక్షణ కోసమే కానీ నాశనం చేయడానికి కాదు. "ప్రభువు తాను ప్రేమించువానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును" (హెబ్రీ 12:6).

# అధ్యాయం 8

# రెండవ రాకడ కోసం మనల్ని మేల్కొలుపుతున్నాడు

## మూడవ జవాబు

*క్రీస్తు యొక్క రెండవ రాకడ కోసం సిద్ధపడడానికి దేవుడిచ్చిన మేల్కొలుపే కరోనా వైరస్*

యుగాంతం గురించి చేసిన విఫలమైన ప్రవచనాలతో క్రైస్తవ సంఘచరిత్ర నిండిపోయింది. అయినా యేసుక్రీస్తు తిరిగి రాబోతున్నాడనేది మాత్రం సత్యం. "గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశము వైపు చూచుచున్నారు? మీ యొద్ద నుండి పరలోకమునకు చేర్చుకొనబడిన ఈ యేసే, ఏ రీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చును" (అపొ.కా. 1:11).

ఆయన వచ్చినప్పుడు లోకానికి తీర్పు తీరుస్తాడు:

> "తన మహిమతో మనుష్యకుమారుడును ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడై యుండును.

> అప్పుడు సమస్త జనములు ఆయన యెదుట పోగు చేయబడుదురు; గొల్లవాడు మేకలలో నుండి గొర్రెలను వేరుపరచును" (మత్తయి 25:31–32).

క్రీస్తును ఎదుర్కొనడానికి సిద్ధపడనివాళ్ళకు ఆ దినం ఒక ఉరిలా అకస్మాత్తుగా వస్తుంది:

> "మీ హృదయములు ఒకవేళ తిండి వలనను మత్తు వలనను ఐహిక విచారముల వలనను మందముగా ఉన్నందున ఆ దినము అకస్మాత్తుగా మీ మీదికి ఉరి వచ్చినట్లు రాకుండ మీ విషయమై మీరు జాగ్రత్తగా ఉండుడి" (లూకా 21:34).

## పురిటి నొప్పులు

యుద్ధాలు, కరువులు, భూకంపాలు వంటి సూచనలు తన రాకడకు ముందు సంభవిస్తాయని యేసు చెప్పాడు (మత్తయి 24:7). ఆయన ఈ సూచనలను "పురిటి నొప్పులు" అని పిలిచాడు (మత్తయి 24:8). పురిటి నొప్పులు పడుతున్న స్త్రీతో ప్రభువు భూమిని పోల్చాడు. నూతన ప్రపంచానికి జన్మనివ్వడానికి అది ప్రయత్నిస్తోంది. తన రాకడలో ఆ నూతన ప్రపంచాన్ని యేసు ఉనికిలోనికి తీసుకువస్తాడు.

రోమా 8:22 లో పౌలు ఈ పద చిత్రాన్నే ఉపయోగించాడు. ఈ యుగంలోని మూలుగులన్నింటినీ అనగా ప్రకృతి వైపరీత్యాల

వల్ల, ప్రమాదాల వల్ల (కరోనా వైరస్ లాంటి) వ్యాధుల వల్ల కలిగే దురవస్థలనూ పురిటినొప్పులతో అతడు పోల్చాడు.

లోకం యొక్క పురిటినొప్పుల్లో భాగమే మన వ్యాధులని అతడు చెప్పాడు. యేసుని రాకడ సమయంలో మన దేహాల విమోచన కోసం ఎదురుచూస్తూ మనం మూలుగుతున్నాం. ఆయన వచ్చినప్పుడు మృతులను తిరిగి లేపుతాడు. నూతనమైన మహిమ గల దేహాలను మనకు అనుగ్రహిస్తాడు (ఫిలిప్పీ 3:21).

> "ఏలయనగా సృష్టి నాశనమునకు లోనయిన దాస్యములో నుండి విడిపింపబడి, దేవుని పిల్లలు పొందబోవు మహిమగల స్వాతంత్ర్యము పొందుదునను నిరీక్షణ గలదై స్వేచ్ఛగా కాక దానిని లోపరచినవాని మూలముగా వ్యర్థపరచబడెను. సృష్టి యావత్తు ఇది వరకు ఏకగ్రీవముగా మూలుగుచు ప్రసవ వేదన పడుచునున్నదని యెరుగుదుము. అంతేకాదు ఆత్మ యొక్క ప్రథమ ఫలముల నొందిన మనము కూడ దత్తపుత్రత్వము కొరకు అనగా మన దేహము యొక్క విమోచనము కొరకు కనిపెట్టుచు మనలో మనము మూలుగుచున్నాము" (రోమా 8:21-23).

## మెలకువగా ఉండండి!

(కరోనా వైరస్‌లాంటి) పురిటి నొప్పులను ఆయన వస్తున్నాడనే సత్యాన్నీ, మనం సిద్ధంగా ఉండాలనే ఆజ్ఞనూ గుర్తు చేసేవిగా, హెచ్చరించేవిగా మనం చూడాలని ఆయన కోరుతున్నాడు. "మీరు అనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును గనుక మీరు సిద్ధపడి యుండుడి" (మత్తయి 24:44).

యేసు చెబుతున్న మాటను తీవ్రంగా తీసుకోవడానికి మీరు తేదీ నిర్ణయించేవారు కానవసరం లేదు. ఆయన చెప్పిన మాట పొరపాటుకు తావు లేనిది. "జాగ్రత్త పడుడి; మెలకువగా ఉండుడి. ఆ కాలమెప్పుడు వచ్చునో మీకు తెలియదు.... మెలకువగా ఉండుడి.... ఇంటి యజమానుడు ... ఎప్పుడు వచ్చునో మీకు తెలియదు. నేను మీతో చెప్పుచున్నది అందరితోను చెప్పుచున్నాను; మెలకువగా ఉండవలెను" (మార్కు 13:33-37).

పదే పదే "మెలకువగా ఉండండి" అని యేసు స్పష్టమైన సందేశాన్నిస్తున్నాడు. ప్రపంచంలోని ప్రకృతి సంబంధమైన పురిటి నొప్పులు ఈ సందేశం నిమిత్తమే ఉద్దేశించబడ్డాయి. అయ్యో, ఎంతమంది ప్రజలు మెలకువగా లేరో కదా! యేసుక్రీస్తు రాకడ విషయంలో వారు గాఢనిద్రలో ఉన్నారు. రాబోతున్న ప్రమాదం గొప్పది. సిద్ధపడి ఉండడానికి కరోనా వైరస్ అనేది కనికరంతో కూడిన మేల్కొలుపు.

సిద్ధపడి ఉండడానికి మార్గం: యేసుక్రీస్తు దగ్గరకు వచ్చి, పాపాలకు క్షమాపణ పొంది ఆయన వెలుగులో నడవడమే. అప్పుడు 1థెస్స 5:4-10 వచనాల్లో ఉన్నవారి వలె మీరు ఉంటారు. పౌలు ఇలా అంటున్నాడు,

> "ఆ దినము దొంగవలె మీ మీదికి వచ్చును. మీరు చీకటిలో ఉన్నవారు కారు. మీరందరు వెలుగు సంబంధులునై యున్నారు.... కావున మనము .... మెలకువగా ఉందము.... ఎందుకనగా మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రక్షణ పొందుటకే దేవుడు మనలను నియమించెను గాని ఉగ్రత పొందుటకు నియమింప లేదు. మనము మేలుకొనియున్నను నిద్రపోవుచున్నను తనతో కూడ జీవించు నిమిత్తము ఆయన మన కొరకు మృతి పొందెను" (1థెస్స 4:4-10).

# అధ్యాయం 9

# క్రీస్తు యొక్క అనంతమైన విలువకు అనుగుణంగా మనల్ని మలుస్తున్నాడు

## నాలుగవ జవాబు

*మనల్ని మారుమనస్సు పొందమనీ, క్రీస్తు యొక్క అనంతమైన విలువకు అనుగుణంగా మన జీవితాలను మలుచుకోమనీ కరోనా వైరస్ ద్వారా దేవుడు ఉరుములాంటి శబ్దంతో పిలుపునిస్తున్నాడు*

మారుమనస్సు పొందమని పిలుపునిస్తున్న వాటిలో కరోనా వైరస్ వినూత్నమైనదేమీ కాదు. వరదలు, కరువులు, మిడతలు, సునామీలు, వ్యాధులు మొదలైన ప్రకృతి వైపరీత్యాలన్నీ మారుమనస్సు పొందమని దేవుడిస్తున్న వేదనకరమైన, కృపాసహితమైన పిలుపులే.

లూకా 13:1-5 లో విపత్తుకు యేసు స్పందించిన విధానం ద్వారా మనం దీనిని చూడవచ్చు:

"పిలాతు గలిలయులైన కొందరి రక్తము వారి బలులతో కలిపియుండెను. ఆ కాలమున అక్కడనున్న కొందరు ఈ సంగతి యేసుతో చెప్పగా, ఆయన వారితో ఇట్లనెను – ఈ గలిలయులు అట్టి హింసలు పొంది నందున వారు గలిలయులందరి కంటె పాపులని మీరు తలంచుచున్నారా? కారని మీతో చెప్పుచున్నాను; మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు. మరియు సిలోయములోని గోపురము పడి చచ్చిన ఆ పదునెనిమిది మంది, యెరూషలేములో కాపురమున్న వారందరి కంటే అపరాధులుని తలంచుచున్నారా? కాదని మీతో చెప్పుచున్నాను; మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు."

ఆరాధించడానికి వచ్చిన వారిని పిలాతు దేవాలయంలో వధించాడు. సిలోయము గోపురం కూలిపోవడం వల్ల అక్కడ నిలబడి ఉన్న 18 మంది వ్యక్తులు మరణించారు. ఒక విపత్తు మానవ దుష్టత్వపు ఫలితం. మరొకటి ఒక ప్రకృతి వైపరీత్యం.

## విపత్తు యొక్క అర్థం - మీ కోసం

"ఈ సంఘటన యొక్క అర్థం ఏమిటి? ఆ వ్యక్తులు చేసిన పాపాలపై ఇది దేవుని తీర్పుగా వచ్చిందా?" అనే విషయాన్ని జనసమూహాలు యేసు నుంచి తెలుసుకోవాలని అనుకున్నారు. యేసు చెప్పిన జవాబు అద్భుతంగా ఉంది. ఈ దుర్ఘటనల నుంచి కేవలం మరణించిన వారికి మాత్రమే కాక, ప్రతి ఒక్కరికీ సంబంధించిన ఒక అర్థాన్ని ఆయన వెల్లడి చేశాడు. రెండు సందర్భాలలోనూ "పిలాతుచేత హత్య చేయించబడినవాళ్ళు గానీ, గోపురం క్రింద పడి నలిగిపోయి మరణించినవారు గానీ మీకంటే ఘోరమైన పాపులేమీ కారు" అని ఆయన చెబుతున్నాడు.

ఆయన వారి పాపం గురించి ఎందుకు ప్రస్తావించాడు? తమ పాపం గురించి ఆయనకున్న అభిప్రాయం గురించి వారు అడగడం లేదు? ఇతరుల గురించి వారు కుతూహలాన్ని కనపరుస్తున్నారు. ఆ దుర్ఘటనలు ఇతరులకు కాకుండా మరణించినవారి విషయంలో ఏమైయున్నవో వాళ్ళు తెలుసుకోవాలనుకున్నారు.

అదే యేసు జవాబును అద్భుతంగా చేసింది. ఈ దుర్ఘటనలు ప్రతి ఒక్కరి నిమిత్తం ఉద్దేశించబడినవి అని ఆయన చెప్పిన మాటల యొక్క సారాంశం "మారుమనస్సు పొందు, లేకపోతే నశిస్తావు" అన్నదే సందేశం. "మీరు మారుమనస్సు పొందకపోతే, మీరు కూడా అలాగే నశిస్తారు" అనే మాటను ఆయన రెండుసార్లు చెప్పాడు (లూకా 13:3,5).

## సమయం ఉండగానే కనికరంతో కూడిన పిలుపు

యేసు ఏమి చేస్తున్నాడు? ప్రజల విభ్రాంతిని ఆయన దారి మళ్ళిస్తున్నాడు. యేసును విచారించడానికి ఈ ప్రజలను పురికొల్పిన ఆశ్చర్యం సరియైన రీతిగా లేదు. ఎంతో క్రూరంగా, నిష్కారణంగా ప్రజలు హత్యచేయబడినందుకు వాళ్ళు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే, "మీరు హత్యకు గురికానందుకు, గోపురం క్రింద పడి మరణించనందుకు మీరు నిజానికి ఆశ్చర్యపోవాలి. నిజానికి మీరు మారుమనస్సు పొందకపోతే ఏదో ఒక రోజున మీరు కూడా అదే రకంగా తీర్పును ఎదుర్కోవలసి వస్తుంది" అని యేసు చెబుతున్నాడు.

"అలాంటి దుర్ఘటనలన్నింటిలో దేవుని నుంచి కనికరంతో కూడిన ఒక సందేశం ఉన్నదని" ఈ వాక్యభాగం నుంచే ప్రతిపాదిస్తున్నాను. మనమందరం పాపులం, నాశనానికి పాత్రులం. సమయముండ గానే మారుమనస్సు పొంది రక్షించబడాలి ఇలాంటి వైపరీత్యాలన్నీ దేవుని నుంచి వచ్చే కృపాసహిత మేల్కొలుపులు. చనిపోయిన వారి వైపు నుంచి బ్రతికి ఉన్నవాళ్ళ వైపు దృష్టి మళ్ళించి యేసు ఇలా అంటున్నాడు, "చనిపోయినవాళ్ళ గురించి మనం మాట్లాడవద్దు; మీ గురించి మాట్లాడుకుందాం. ఇది అత్యవసరం. వాళ్ళకు జరిగినదేదో అది మీ కోసమే. అతి పెద్ద విషయం వాళ్ళ పాపం కాదు, మీది." ఈ కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో లోకానికి దేవుడిచ్చే సందేశం ఇదేనని నా ఉద్దేశం. సమయం ఉండగానే మారు మనస్సు పొందమని ఆయన లోకానికి పిలుపునిస్తున్నాడు.

## మారుమనస్సు అంటే అర్థం ఏమిటి?

ఇప్పుడు మరింత స్పష్టంగా మారుమనస్సు గురించి తెలుసుకుందాం. మారుమనస్సు అంటే ఏమిటి? హృదయాన్నీ, మనస్సునూ మార్చుకోవడం అనే అర్థం కొత్త నిబంధన పదానికి ఉంది. ఇదొక అభిప్రాయాన్ని పైపైన మార్చుకోవడం కాదు, అంతరంగంలో నుంచి కలిగే పెనుమార్పు ఇది. ఈ మార్పు మూలంగా దేవుడు, యేసు నిజంగా ఏమైయున్నారో మనం గ్రహించగలుగుతాం, వారిని విలువైనవాళ్ళుగా ఎంచగలుగుతాం.

> "అందుకాయన – నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ మనస్సుతోనూ నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననుదియే" (మత్తయి 22:37).

> "తండ్రినైనను తల్లినైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు; కుమారునినైనను కుమార్తెనైనను నా కంటే ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు" (మత్తయి 10:37).

మరొకరీతిగా చెప్పాలంటే, దేవుణ్ణీ, క్రీస్తునూ పెన్నిధిగా భావించి, ఇతర సంబంధ బాంధవ్యాలన్నింటి కంటే ఎక్కువగా దేవునితో, క్రీస్తుతో

సాన్నిహిత్యాన్ని కలిగి ఉండమని మారుమనస్సు డిమాండ్ చేస్తోంది. ఇది అత్యంత ప్రాథమికమైన మార్పు.

## నాశనం గురించి యేసు మనల్ని ఎందుకు బెదిరిస్తున్నట్లు?

మారుమనస్సు పొందకపోతే మనందరం కూడా అదే విధంగా నశిస్తామని యేసు చెప్పాడు. దానికి కారణం: మనం ఎక్కువగా ప్రేమించే అల్పమైన విషయాల కోసం అత్యంత గొప్ప నిధి వంటి దేవుణ్ణి విస్మరించాము (రోమా 1:22-23). ధనం, వినోదం, స్నేహితులు, కుటుంబం మొదలైనవాటి కంటే యేసు పెద్దగా కోరదగినవాడు కాదన్నట్లు మనం ప్రవర్తించాం. మనందరం నాశనానికి పాత్రులమయ్యింది మనం ఉల్లంఘించిన కొన్ని నియమాలను బట్టి కాదు. యేసుక్రీస్తులో దేవుడు మనకు ఏమైయున్నాడో ఆ అనంతమైన విలువను అవహేళన చేసినందుకే!

## తీవ్రమైన నష్టాన్ని కలిగించే ఇష్టాల నుంచి వైదొలగాలి

చాలాసార్లు మన నిర్ణయాలు బంగారాన్ని విడిచిపెట్టి చెత్తను కోరుకున్నట్లు, స్థిరమైన బండపై కాక ఇసుకపై పునాది వేసుకున్నట్లు, విశ్రాంతి దినాన సముద్ర తీరాన సేదదీరడానికి బదులు, రోడ్డు ప్రక్కనున్న మురికి కాలువలో ఆటలాడుకున్నట్లు ఉంటాయి. C.S. లూయిస్ ఇలా రాశాడు,

> "మనం జ్ఞానం లేని ప్రాణులం. అపరిమితమైన ఆనందాన్ని దేవుడు మనకు అనుగ్రహించడానికి సిద్ధంగా ఉంటే, మనమేమో త్రాగుడు, కామం, ధనం, అధికారం తదితర విషయాలలో కాలాన్ని వృధా చేస్తున్నాము. సముద్ర తీరంలో సెలవు దినాన్ని ఆస్వాదించడం అంటే ఏమిటో ఎరుగని, తాను నివసించే మురికివాడలో మట్టితో బిస్కెట్లు తయారు చేసుకుంటున్న ఒక అమాయక పిల్లవాడిలా మనం ఉన్నాం. మనం చాలా అల్ప సంతోషులం."[5]

లూయిస్ ప్రస్తావిస్తున్న "అపరిమితమైన ఆనందం" అంటే క్రీస్తు యొక్క విలువనూ, సౌందర్యాన్నీ, గొప్పతనాన్నీ చూసి, ఆస్వాదించి, ఇతరులతో పంచుకున్న అనుభవం.

## క్రీస్తుపై ఆధారపడడానికి ప్రేరణ

యేసుక్రీస్తు యొక్క అనంతమైన గొప్పతనంలో, విలువలో మనం కనుగొనే భద్రతనూ, తృప్తినీ ఈ లోకంలో ఉన్న ఏదీ ఇవ్వలేదు. కరోనా వైరస్ ద్వారా మన కళ్ళకు కట్టినట్లు బాధాకరంగా దేవుడు ఈ వాస్తవాన్ని చూపిస్తున్నాడు. స్వేచ్ఛగా ప్రయాణించే, మన ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించే, ముఖాముఖిగా సంబంధ బాంధవ్యాలను కలిగి ఉండే అవకాశాన్నీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న

ఈ మహమ్మారి తొలగించింది. ఇది మన భద్రతనూ, ఆదరణనూ మనకు దూరం చేస్తోంది. చివరికి ఇది మన ప్రాణాలను కూడా హరించే అవకాశం ఉంది.

క్రీస్తుపై ఆధారపడేలా ప్రేరణనివ్వడానికే దేవుడు ఇలాంటి నష్టాలను మనకు బహిర్గతం చేస్తున్నాడు. మరొకరీతిగా చెప్పాలంటే లోకానికి క్రీస్తును అనుగ్రహించడానికి ఈ ఉపద్రవాన్ని అవకాశంగా చేసుకోవడానికి కారణం: శ్రమలో క్రీస్తు ఆనందాన్ని కొనసాగించి నప్పుడు సకల సంతృప్తినిచ్చే క్రీస్తు యొక్క గొప్పతనం మరింత కాంతి వంతంగా ప్రకాశించాలనే!

## దిక్కుతోచని పరిస్థితే క్రైస్తవులకొక వరం

ఉదాహరణకు పౌలు తన జీవితంలో నిరాశ నిస్పృహలకు గురయ్యే స్థితికి దేవుడు ఎందుకు తీసుకొచ్చాడో ఆలోచించండి.

> "సహోదరులారా, ఆసియలో మాకు తటస్థించిన శ్రమను గూర్చి మీకు తెలియకుండుట మాకిష్టము లేదు; అదేదనగా మేము బ్రతుకుదుమను నమ్మకము లేక యుండునట్టుగా మా శక్తికి మించిన అత్యధిక భారము వలన క్రుంగిపోతిమి. మరియు మృతులను లేపు దేవుని యందేగాని, మాయందే మేము నమ్మిక యుంచకుండు నట్లు మరణము వరకును నిశ్చయము మామట్టుకు మాకు కలిగియుండెను" (2కొరింథీ 1:8-9).

ఈ శ్రమానుభవం సాతాను మూలంగానో, లేక యాదృచ్ఛికం గానో జరిగిందని పౌలు అనుకోవడం లేదు. దీని వెనుక ఒక ఉద్దేశం ఉందని అతడు గ్రహించాడు. దేవుని ఉద్దేశం ఇలా ప్రకటించబడింది. ప్రాణాపాయకరమైన ఈ అనుభవం "మృతులను లేపు దేవునియందే గాని, మా యందే మేము నమ్మిక యుంచ కుండునట్లు" జరిగింది (1:9).

కరోనా వైరస్ ఇచ్చే సందేశం ఇదే: మీపైన మీరు ఆధారపడడం మానేయండి. దేవుని వైపు తిరగండి. మరణాన్ని కూడా మీరు ఆపలేరు. దేవుడు మృతులను లేపగలడు. దేవునిపై ఆధారపడడమంటే క్రైస్తవులు సోమరులవుతారని అర్థం కాదు. క్రైస్తవులు ఎన్నడూ సోమరులుగా లేరు. దేవునిపై ఆధారపడడం అంటే మన పనులన్నింటికీ ఆధారం, ఆశ్రయం, మన పనిచేసే పద్ధతీ అన్నీ దేవుడేనని అర్థం. ఇది పౌలు ఈ క్రింద చెప్పిన మాటలా ఉంది. "నాకు అనుగ్రహింపబడిన ఆయన కృప నిష్ఫలము కాలేదు గాని, వారందరికంటే నేనెక్కువగా ప్రయాస పడితిని" (1కొరింథీ 15:10).

మన జీవితాలకు దేవుణ్ణి అత్యంత ప్రాముఖ్యమైన వాస్తవంగా చేసుకొమ్మని కరోనా వైరస్ మనకు పిలుపునిస్తోంది. మన జీవితాలు మనం తీసుకునే ఊపిరిపై కంటే ఆయన పైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. మనల్ని మనం ఆయన పాదాలపై పడేలా చేయడానికి కొన్నిసార్లు దేవుడు మన ఊపిరిని తీసేసుకుంటాడు.

## దేవుడు పెట్టే 'ముల్లుకు' అర్థం

పౌలు శరీరంలో బాధాకరమైన ముల్లును ఉంచడం వెనుక దేవుని ఉద్దేశం గురించి ఆలోచించండి.

> "నాకు కలిగిన ప్రత్యక్షతలు బహు విశేషముగా ఉన్నందున నేను అత్యధికముగా హెచ్చిపోకుండు నిమిత్తము నాకు శరీరములో ఒక ముల్లు, నేను అత్యధికముగా హెచ్చిపోకుండు నిమిత్తము, నన్ను నలగగొట్టుటకు సాతాను యొక్క దూతగా ఉంచ బడెను. అది నా యొద్దనుండి తొలగిపోవలెనని దాని విషయమై ముమ్మారు ప్రభువును వేడుకొంటిని. అందుకు – నా కృప నీకు చాలును, బలహీనతయందు నా శక్తి పరిపూర్ణమగుచున్నదని ఆయన నాతో చెప్పెను" (2కొరింథీ 12:7-9).

గొప్ప ప్రత్యక్షతలతో పౌలు దీవించబడ్డాడు. గర్వమనే అపాయాన్ని దేవుడు చూశాడు. సత్యం, సంతోషం అనేవాటిని సాతాను ప్రమాదంగా చూశాడు. పౌలు యొక్క సాక్ష్యాన్ని ఏదైతే నాశనం చేస్తుందని సాతాను అనుకున్నాడో అదే పౌలు యొక్క దీనత్వానికీ, ఆనందానికీ సహకరించేలా దేవుడు సాతాను యొక్క పథకాన్ని నియంత్రించాడు. సాతాను దూతగా శరీరంలో ఒక ముల్లును పౌలు

పొందుకున్నాడు. ఆ ముల్లు ఏమిటో మనకు తెలియదు. అయితే ముళ్ళు బాధాకరమైనవని మనకు తెలుసు. ఆ ముల్లును తీసివేయమని పౌలు మూడు సార్లు క్రీస్తును వేడుకున్నాడని మనకు తెలుసు.

అయితే క్రీస్తు ఆ ముల్లును తొలగించలేదు. ఆ బాధ వెనుక ఆయన కొక ఉద్దేశం ఉంది "బలహీనతలో నా శక్తి పరిపూర్ణమగును" అనేదే ఆ ఉద్దేశం (12:9). పౌలు యొక్క అచంచలమైన విశ్వాసం ద్వారా ఆనందం ద్వారా ఆరోగ్యం కంటే ఎంతో విలువైన వానిగా క్రీస్తు ప్రకాశించాలన్నదే అతని ఉద్దేశం. పౌలు ఈ ఉద్దేశానికి ఎలా స్పందించాడు? "విశేషముగా నా బలహీనతల యందే బహు సంతోషముగా అతిశయపడుదును" (12:9).

సంతోషంగానా? ఇదెలా సాధ్యం? ఈ ముల్లును హత్తుకోవ డానికి పౌలు ఎందుకు సమ్మతిస్తున్నాడు? ఎందుకంటే, బ్రతుకు మూలముగానైనను చావు మూలముగానైనను సరే క్రీస్తు పౌలు యొక్క శరీరమందు ఘనపరచబడాలన్నదే అతని జీవితంలో ఉన్న గొప్ప ఆశయం (ఫిలిప్పీ 1:20). క్రీస్తు యొక్క సౌందర్యాన్ని చూడడం, క్రీస్తును పెన్నిధిగా ఆస్వాదించడం, ఆరోగ్యం కంటే, జీవం కంటే శ్రేష్ఠమైనవాడు క్రీస్తు అని లోకానికి చూపించడం పౌలుకు ఆనందం. The Thorn (ముల్లు) అనే అద్భుతమైన గేయాన్ని Martha Snell Nicholson (1898-1953) రచించింది. ఈ గేయం ఈ మాటలతో ముగుస్తుంది.

*అత్యధిక కృప అనుగ్రహించకుండా ఆయన*
*ముల్లును ఎన్నడూ పెట్టడు*
*తన ముఖాన్ని మరుగుచేసే ముసుగును తొలగించ*
*డానికే ఆయన ముల్లును పెడతాడు*

## నష్టంలో కూడా లాభమే

పౌలు నష్టాన్ని హత్తుకున్నాడు. ఎందుకంటే నష్టంలోనే క్రీస్తు సంపూర్ణమైన లాభంగా ఉన్నాడు.

> "నిశ్చయముగా నా ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అతి శ్రేష్ఠమైన జ్ఞానము నిమిత్తము సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను" (ఫిలిప్పీ 3:8).

జీవం కంటే ఎక్కువగా క్రీస్తులో దేవుణ్ణి నిధిగా చేసుకునే విధంగా హృదయాన్నీ, మనస్సునూ మార్చుకున్న అనుభవమే మారుమనస్సు పొందడమంటే అర్థం. "నీ కృప జీవము కంటే ఉత్తమము, నా పెదవులు నిన్ను స్తుతించును" (కీర్తన 63:3). ఇదే పౌలుకు ఉన్న విశ్వాసం. జీవంలోనూ మరణంలోనూ ఇదే సత్యమైనది. జీవిస్తున్నప్పుడు ప్రతి విధమైన ఆనందం కంటే మరి శ్రేష్ఠమైన మాధుర్యం కాబట్టి, మరణిస్తున్నప్పుడు దేవుని సన్నిధిలో సంపూర్ణ ఆనందం ఉంది; ఆయన కుడిచేతిలో నిత్య సుఖములు ఉన్నాయి కాబట్టి! (కీర్తన 16:11).

కరోనా వైరస్ మహమ్మారి మూలంగా కొద్దిమొత్తంలోనూ, భారీగానూ నష్టపోయిన వారుంటారు. పౌలు ఆనందం వెనక ఉన్న రహస్యాన్ని మనం తెలుసుకుంటే, ఆ నష్టాన్ని కూడా లాభంగా మనం అనుభవించవచ్చు. దేవుడు లోకానికి చెబుతున్నది ఇదే! మారుమనస్సు పొందండి, క్రీస్తు యొక్క అనంతమైన విలువకు అనుగుణంగా మిమ్మల్ని మీరే మలుచుకోండి!

# అధ్యాయం 10

# అపాయంలోనూ సత్క్రియలను సృష్టిస్తున్నాడు

## అయిదవ జవాబు

*దేవుని ప్రజలు తమపై తామే జాలిపడడం మానేసి*
*భయాన్ని అధిగమించి, సాహసంతో కూడిన సంతోషంతో*
*దేవుణ్ణి మహిమపరిచే సత్క్రియలను చేయమని*
*దేవుడిస్తున్న పిలుపే కరోనా వైరస్.*

"మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" అని యేసు తన అనుచరులకు బోధించాడు (మత్తయి 5:16). తరచుగా గమనించబడని విషయమేమిటంటే, ఈ విధంగా భూమికి ఉప్పుగా, లోకానికి వెలుగుగా ఉండడం అంటే మరింత ఎక్కువగా ఉప్పుగా, మరింత ఎక్కువ ప్రకాశమానంగా ఉండడమే. ఎందుకంటే శ్రమల మధ్యలో సహితం సత్క్రియలు చేయాల్సిందే!

## అపాయమనే అంధకారంలో వెలుగు

"నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి; పరలోకమందు మీ ఫలము అధిక మగును. ఈలాగున వారు మీకు పూర్వమందుండిన ప్రవక్తలను హింసించిరి" (మత్తయి 5:11-12) అని యేసు చెప్పాడు. ఆ తర్వాత ఎలాంటి విరామమూ లేకుండానే, "మీరు లోకమునకు ఉప్పయి యున్నారు.... మీరు లోకమునకు వెలుగైయున్నారు..." (మత్తయి 5:13-14) అని కూడా చెప్పాడు.

క్రైస్తవ్యానికి వన్నె తెచ్చేవి కేవలం సత్క్రియలే కాదు. అపాయ మున్నప్పటికీ సత్క్రియలు చేయడమే క్రైస్తవ్యానికి నిజమైన ఘనత. క్రైస్తవేతరులు చాలామంది సత్క్రియలు చేస్తుంటారు. అయితే ఆ సత్క్రియల నిమిత్తం వాళ్ళు దేవునికి మహిమ నివ్వడం మాత్రం అత్యంత అరుదు.

మత్తయి 5వ అధ్యాయంలో ప్రస్తావించబడిన అపాయం వ్యాధి గురించినది కాదు, హింస గురించినది. అయితే నియమం మాత్రం పనికొస్తుంది. వ్యాధిలోనైనా, హింసలోనైనా ప్రేమతో కూడిన కార్యాలు దేవునియందు నిరీక్షణ చేతనే చేయబడతాయనే వాస్తవాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఉదాహరణకు, యేసు ఇలా చెబుతున్నాడు,

> "నీవు విందు చేయునప్పుడు పేదలను అంగహీనులను కుంటివాండ్రను గ్రుడ్డివాండ్రను పిలువుము. నీవు ప్రత్యుపకారము చేయుటకు వారికేమియు లేదు గనుక నీవు ధన్యుడవగుదువు; నీతిమంతుల పునరుత్థాన మందు నీవు ప్రత్యుపకారము పొందుదువు" (లూకా 14:13-14).

మరణానికి అతీతంగా దేవునియందు నిరీక్షణ సత్క్రియలను ఓపికతో కొనసాగించడానికీ బలాన్ని ఇస్తుంది (పునరుత్థానమందు నీవు ప్రత్యుపకారము పొందుదువు). ఈ సత్క్రియలకు ఈ జీవితంలో ప్రతిఫలం దక్కకపోవచ్చు. మనల్ని ప్రమాదంలో పెట్టే, మరి ముఖ్యంగా మరణాపాయంలో పెట్టే సత్క్రియల విషయంలో కూడా ఇదే సత్యం.

## యేసు యొక్క ఉపదేశాన్ని పేతురు అన్వయించిన విధానం

సత్క్రియల గురించి యేసు చేసిన స్పష్టమైన బోధను కొత్త నిబంధన గ్రంథకర్తల్లో అందరికంటే ఎక్కువగా ప్రస్తావించింది అపొస్తలుడైన పేతురు.

> "అన్యజనులు మిమ్మును ఏ విషయములో దుర్మార్గులని దూషింతురో, ఆ విషయములో వారు మీ సత్క్రియ లను చూచి, వాటినిబట్టి దర్శన దినమున దేవుని మహిమ పరచునట్లు, వారి మధ్యను మంచి ప్రవర్తన గలవారై యుండవలెనని మిమ్మును బతిమాలుకొను చున్నాను" (1పేతురు 2:12).

అపాయకరమైన పరిస్థితిలో కూడా సత్క్రియల గురించి పేతురు అదే విషయాన్ని చెబుతున్నాడు. "దేవుని చిత్తప్రకారము బాధపడువారు సత్ ప్రవర్తన గలవారై, నమ్మకమైన సృష్టికర్తకు తన ఆత్మలను అప్పగించుకొనవలెను" (1పేతురు 4:19). శ్రమ కలిగిందనీ, లేదా శ్రమ వస్తుందనీ ఆలోచిస్తూ సత్క్రియలు చేయడం మానేయకండని మరొకరీతిగా చెప్పవచ్చు.

## అపాయంలో సత్క్రియలను సృష్టించడం కోసమే క్రీస్తు మరణించాడు

ఈ నూతనమైన జీవితాన్ని మన పాపాల నిమిత్తం యేసు అనుభవించిన మరణంతో పేతురు ముడిపెడుతున్నాడు. "మనము పాపముల విషయమై చనిపోయి నీతి విషయములో జీవించునట్లు క్రీస్తు తానే తన శరీరమందు మన పాపములను ప్రాను మీద మోసికొనెను" (1పేతురు 2:24). క్రీస్తు మూలంగా క్రైస్తవులు పాపాన్ని చంపగలవు, నీతిగల సత్క్రియలు చేయడానికి తమను తాము అర్పించుకోగలరు.

యేసు యొక్క మరణానికీ, సత్క్రియల విషయంలో క్రైస్తవులకు ఉన్న ఆసక్తికీ ఇదే రకమైన సంబంధం ఉన్నదని పౌలు కూడా తెలియ జేస్తున్నాడు. "ఆయన సమస్తమైన దుర్నీతి నుండి మనలను విమోచించి, సత్ క్రియలయందాసక్తి గల ప్రజలను తన కోసరము

పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్నుతానే మన కొరకు అర్పించుకొనెను" (తీతు 4:14).

క్రైస్తవులనూ క్రైస్తవేతరులనూ లక్ష్యంగా చేసుకున్నవే ఈ సత్క్రియలని కూడా పౌలు స్పష్టం చేస్తున్నాడు. "కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారి యెడలను మేలు చేయుదము" (గలతీ 6:10). "ఎవడును కీడునకు ప్రతికీడు చేయకుండ చూచుకొనుడి; మీరు ఒకరి యెడల ఒకడును మనుష్యులందరి యెడలను ఎల్లప్పుడు మేలైనదానిని అనుసరించ నడుచుకొనుడి" (1థెస్స 5:15).

## క్లిష్ట సమయాల్లో దయచూపించడం క్రీస్తును ఘనపరుస్తుంది

తన కుమారుడైన యేసుక్రీస్తు యొక్క విలువను గొప్ప చేయాలనీ, తన గొప్పతనాన్ని మహిమపరచాలనీ దేవుని ఆలోచన. వీటినే తన ప్రజలకు అంతిమ లక్ష్యంగా దేవుడు నిర్దేశించాడు. "కాబట్టి మీరు భోజనము చేసినను పానము చేసినను మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమ కొరకు చేయుడి" (1కొరింథీ 10:31). నా బ్రతుకు మూలంగానైనే సరే, చావు మూలంగానైనా సరే క్రీస్తు నా శరీరమందు ఘనపరచబడాలని నేను మిక్కిలి అపేక్షిస్తున్నాను, నిరీక్షిస్తున్నాను (ఫిలిప్పీ 1:20). ప్రతీ విషయంలోనూ దేవుడు మహిమపరచబడాలి. బ్రతుకుట వలన, మరణించుట వలన కూడా క్రీస్తు ఘనపరచబడాలి. మానవ జీవితానికి దేవుడు నియమించిన గొప్ప ఆశయం ఇదే!

అందువల్ల దేవుని ప్రజలు తమపై తాము జాలిపడడం మానివేసి, భయాన్ని విడిచిపెట్టి, అపాయకరమైన ఈ పరిస్థితుల్లో సత్క్రియలు చేయడానికి తమను తాము అర్పించుకోవాలన్నదే కరోనా వైరస్ వెనక దేవునికున్న ఉద్దేశాల్లో ఒకటి. క్రైస్తవులు తమ ఆదరణ కోసం కాక, ఇతరుల అవసరాన్ని చూడాలి, భద్రత కోసం కాకుండా ప్రేమ చూపించడానికి ప్రయత్నించాలి. మన రక్షకుడు అలాంటివాడే. అందు నిమిత్తమే ఆయన మరణించాడు.

## ఆదిసంఘం కనపరచిన ఆదర్శం

The Triumph of Christianity అనే పుస్తక రచయిత Rodney Stark తన పుస్తకంలో ఇలా రాశాడు, "అవసరంలో ఉన్న అందరికీ అంటే కుటుంబ సరిహద్దులు దాటి విశ్వాసులకు అతీతంగా క్రైస్తవ ప్రేమ, దాతృత్వం విస్తరించాలన్నదే తొలి శతాబ్దాలలో క్రైస్తవ సంఘం తీసుకున్న విప్లవాత్మకమైన నియమం."[6]

క్రీ.శ. 165 సం॥లోనూ, 251 సం॥లోనూ రెండు భయంకర మైన తెగుళ్ళు రోమా సామ్రాజ్యంపై దాడిచేశాయి. క్రైస్తవ సంఘానికి బయట కనికరానికీ, త్యాగానికీ సాంస్కృతికమైన, మతపరమైన పునాది ఏదీ లేదు. "మానవుల విషయాలను దేవుళ్లు శ్రద్ధ తీసుకుంటారు అనే విశ్వాసం లేదు".[7] "కనికరం అనేది గుణంలో ఏదో లోపంగానూ, జాలి అనేది రోగంతో కూడిన భావోద్వేగంగానూ పరిగణించబడేది;

ఎందుకంటే కనికరం చూపించడం అనేది అన్యాయస్థులకు అయోగ్యులకు, చేసే సహాయం చేయడమే కాబట్టి ఇది న్యాయానికి విరుద్ధమైనది.[8]

అందువల్ల రాజ్యంలో 3వ భాగం వ్యాధి చేత నాశనమవు తుండగా, వైద్యులు తమ తమ స్వగ్రామాలకు పారిపోయారు. రోగ లక్షణాలున్న వారిని ఇంటి నుంచి వెళ్ళగొట్టబడ్డారు. పూజారులు దేవాలయాలను విడిచిపెట్టేశారు. "అయితే క్రైస్తవులు ప్రజల మనస్సుల్లోని ప్రశ్నలకు జవాబు తమ దగ్గరున్నాయని చెప్పారు. అన్నిటికంటే ముఖ్యంగా వాళ్లు తగిన విధంగా ప్రజలకు సహాయం చేశారు" అని Stark తెలియజేశాడు.[9]

క్రీస్తు ద్వారా పాపాలకు క్షమాపణ, మరణానికి అతీతంగా నిత్యజీవం గురించిన జవాబులు ఇందులో ఉన్నాయి. వైద్యపరమైన నిస్సహాయత, దిక్కుతోచని స్థితి ఉన్న సమయంలో ఇదొక విలువైన సందేశంగా పనిచేసింది.

సహాయ చర్యల విషయానికొస్తే, విస్తార సంఖ్యలో క్రైస్తవులు రోగులకు, మరణిస్తున్న వారికి సేవలు చేశారు. రెండవ తెగులు అంతమొందుతున్న సమయంలో అలెగ్జాండ్రియాకు చెందిన బిషప్ డయొనీషియష్ తన సంఘంలో సభ్యులను అభినందిస్తూ ఒక లేఖ రాశాడు:

> మన సహోదరుల్లో అనేకమంది అపరిమితమైన ప్రేమనూ, నమ్మకత్వాన్నీ కనపరిచారు. తమను తాము సంరక్షించుకోవడానికి ఎన్నడూ ప్రయత్నించలేదు. ఇతరుల క్షేమాన్నే వాళ్ళు ఎక్కువగా పట్టించుకున్నారు. ప్రమాదకరమైనప్పటికీ వాళ్ళు రోగుల్ని పట్టించు కున్నారు. క్రీస్తులో వారికి ఉన్న ప్రతీ అవసరాన్నీ తీర్చారు. వారికి పరిచర్యలు చేశారు. వాళ్ళతోనే ప్రశాంతంగా, సంతోషంగా ఈ జీవితాన్ని విడిచి పెట్టారు.[10]

## చక్రవర్తుల అజ్ఞానానికి అడ్డుకట్ట వేశారు

వ్యాధిగ్రస్థుల యెడల, పేదల యెడల ఆనాటి సంస్కృతికి భిన్నమైన క్రైస్తవులు చూపిన శ్రద్ధ చుట్టుప్రక్కలుండే అన్య మతాల నుంచి ఎంతోమందిని గెలుచుకోవడానికి కారణమయ్యింది. రెండు శతాబ్దాల తర్వాత రోమా చక్రవర్తి జూలియన్ (క్రీ.శ. 332–363) రోమా మతానికి నూతన జీవాన్ని తిరిగి తీసుకురావాలని అతడు ప్రయత్నించాడు. ఆ సమయంలో క్రైస్తవ్యం అతని ఆశకు ముప్పుగా పరిణమిస్తుందని గుర్తించాడు. విసుగు చెంది గలతీలో ఉన్న రోమా ప్రధాన అర్చకుడికి ఇలా రాశాడు,

> “పరదేశులకు ప్రేమతో కూడిన సేవలందించడం ద్వారా, మృతిచెందినవారిని సమాధి చేయడంలో శ్రద్ధ చూపించడం ద్వారా ఈ క్రైస్తవ్యం (క్రైస్తవ విశ్వాసం) బాగా వర్ధిల్లింది. భిక్షమెత్తుకునే యూదుడు ఒక్కడు కూడా లేకపోవడం, నాస్తికులైన గలతీయులు (క్రైస్తవులు) తమలో పేదవారికే కాదు, మనలోని పేదవారికి కడా పరిచర్య చేస్తున్నారు. ఇది చాలా దారుణంగా ఉంది.”[11]

## దేవుడు పంపించిన శ్రమకు ఉపశమనం కలిగించుట

కరోనా వైరస్‌ను దేవుని చర్యగా చూడడం, అది కలిగించే శ్రమను తగ్గించడానికి రిస్కు తీసుకోమని క్రైస్తవులకు పిలుపు నివ్వడం పరస్పరం విరుద్ధం కావు. ఆదాము పతనమైనప్పుడు దేవుడు లోకాన్ని పాపానికి, దుఃఖానికీ అప్పగించిన నాటి నుంచి, ఆయనే నాశనకరమైన తీర్పును నియమించిన వాడైనప్పటికీ నశించిపోతున్న తన ప్రజలను రక్షించేందుకు ప్రయత్నించేలా ఆయన నియమించాడు. దేవుడు తన న్యాయమైన తీర్పు నుంచి ప్రజలను రక్షించడానికి యేసుక్రీస్తులో లోకానికి దిగివచ్చాడు (రోమా 5:9). క్రీస్తు యొక్క సిలువ అంటే అర్థం ఇదే!

అందువల్ల దేవుని ప్రజలు చేసే సత్కార్యాల్లో రోగుల స్వస్థత కోసం ఈ భయంకరమైన అంటువ్యాధిని అంతమొందించమని దేవుణ్ణి

వేడుకోవడం కోసం, మందును కనిపెట్టడానికి సహాయం కోసం చేసే ప్రార్థనలు ఉంటాయి. మనం కరోనా వైరస్ గురించి ప్రార్థన చేస్తాం, దాని మూలంగా కలిగే శ్రమ నుంచి ఉపశమనాన్ని కలిగించడం కోసం కృషి చేస్తాం. అబ్రహాం లింకన్ అంతర్యుద్ధాన్ని (సివిల్ వార్) దేవుని తీర్పుగా చూసినప్పటికీ అది ముగిసిపోవాలని ప్రార్థన చేశాడు. దాని కోసం కృషి చేశాడు.

> ఈ ఘోరమైన యుద్ధం త్వరగా ముగిసిపోవాలని మేము బలంగా ఆకాంక్షిస్తున్నాము. భారంగా ప్రార్థన చేస్తున్నాము. అయినా ఒకవేళ ఈ యుద్ధం 250 సం॥లుగా నిర్విరామంగా బానిసలు శ్రమపడి సంపాదించిన ధనమంతా ఖర్చయిపోయే వరకు జరిగినా, విస్తారమైన మనుషులు తమ ఆఖరి రక్తపు బొట్టును చిందించే వరకు కొనసాగినా, 3 వేల సం॥ల క్రితం కీర్తనలో చెప్పబడిన మాటను ఇప్పుడు కూడా చెప్పాలి, "యెహోవా న్యాయవిధులు సత్యమైనవి; అవి కేవలం న్యాయమైనవి" (కీర్తన 19:9).

దేవుడు చేయాల్సిన పని దేవునికి ఉంది. ఆ పనిలో ఎక్కువ శాతం మర్మయుక్తంగానే ఉంటుంది. మనం చేయాల్సిన పని మనకు ఉంది. మనం ఆయనను నమ్మి ఆయన వాక్యానికి విధేయత చూపిస్తే తన జ్ఞానయుక్తమైన సత్సంకల్పాలను నెరవేర్చుకోవడానికి తన సార్వభౌమత్వాన్నీ మన సేవనూ ఆయన వినియోగించుకుంటాడు.

# అధ్యాయం 11

# ప్రజలను సువార్తతో చేరుకోవడానికి క్రైస్తవులను పురికొల్పుతున్నాడు

## ఆరవ జవాబు

*ప్రపంచమంతటా ఎక్కడికక్కడ స్థిరపడిపోయిన క్రైస్తవులను కదిలించి సువార్త అందని లోక ప్రజలకు క్రీస్తు సువార్తతో అందించే విధంగా వారిని కరోనా వైరస్ ద్వారా దేవుడు పురికొల్పుతున్నాడు*

కరోనా వైరస్‌ను సువార్త పరిచర్యతో (Missions) ముడిపెట్టడం వింతగా అనిపించవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం కరోనా వైరస్ వల్ల ప్రయాణాలు, వలసలు, మిషనరీ సేవలు నిలిచిపోయాయి. అయితే నేను ప్రస్తుత తాత్కాలిక పరిస్థితుల గురించి ఆలోచించడం లేదు. చరిత్రలో సంఘానికి శ్రమలూ, హింసలూ కలిగినప్పుడు దేవుడు వాటిని ఉపయోగించుకుని తన సంఘాన్ని తాను అత్యవసరమని భావించిన ప్రదేశాలకు తీసుకెళ్ళాడు. కరోనా వైరస్ దీర్ఘకాలిక ప్రభావంలో భాగంగా దేవుడు చరిత్రలో చేసినట్లే మరొకసారి చేస్తాడని నేను భావిస్తున్నాను.

## సంఘానికి కలిగిన హింసే మిషనరీ ప్రణాళిక అయ్యింది

యెరూషలేము నుంచి ప్రజలను సువార్తతో యూదయ సమరయ ప్రాంతాలకు దేవుడెలా తీసుకు వెళ్ళాడో ఆలోచించండి. యెరూషలేముకు... యూదయ సమరయలకు భూదిగంతముల వరకు (అపో.కా. 1:8) సువార్తను తీసుకువెళ్ళమని తన శిష్యులకు యేసు ఆజ్ఞాపించాడు. అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయంలో చూస్తే సువార్త యెరూషలేములోనే స్థిరపడి అక్కడే నిలిచిపోయింది.

సంఘాన్ని సువార్త పరిచర్యకు కలిదించడానికి ఏం కావాలి? స్తెఫను యొక్క మరణమూ, తదుపరి హింస అవసరమయ్యాయి.

స్తెఫను హతసాక్షి కాగానే (అపో.కా. 7:60) హింస చెలరేగింది.

> "ఆ కాలమందు యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగినందున, అపొస్తలులు తప్ప అందరు యూదయ సమరయ దేశములయందు చెదరిపోయిరి. భక్తిగల మనుష్యులు స్తెఫనును సమాధి చేసి అతనిని గూర్చి బహుగా ప్రలాపించిరి. పౌలయితే ఇంటింట జొచ్చి పురుషులను స్త్రీలను ఈడ్చుకొని పోయి, చెరసాలలో వేయించి సంఘమును పాడు చేయుచుండెను. కాబట్టి చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి" (అపో.కా. 8:1-4).

తన బిడ్డలు హతసాక్షులు కావడానికీ, హింసించబడడానికీ ఒప్పుకొని దేవుడు వారిని కదిలించాడు. చివరికి యూదయ సమరయ ప్రాంతాలవారు సువార్తను విన్నారు. దేవుని మార్గాలు మన మార్గాల వంటివి కావు. అయితే ఆయన లక్ష్యం మాత్రం తప్పనిసరిగా నెరవేరుతుంది. యేసు అదే మాటను చెప్పాడు. ఆయన మాట విఫలం కాదు. "...ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు వాని యెదుట నిలువనేరవు..." (మత్తయి 16:18). "ఈ రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటయు ప్రకటింపబడును, అటు తరువాత అంతము వచ్చును" (మత్తయి 24:14). "ప్రకటించబడవచ్చేమో" కాదు, "ప్రకటించబడుతుంది.

## ఆటంకాలు కూడా అభివృద్ధికే

కరోనా వైరస్ వ్యాప్తి ప్రపంచ సువార్తీకరణకు ఆటంకమని మన ఆలోచన. అయితే నేను దానితో ఏకీభవించను. దేవుని మార్గాలు తరచూ ఆటంకాలుగా కనబడతాయి. కానీ ఫలితం మాత్రం గొప్ప పురోగతి.

జనవరి 9వ తేదీ 1985 వ సం॥లో బల్గేరియా దేశానికి చెందిన కాంగ్రిగేషనల్ పాస్టర్ Hristo Kulichev అరెస్టు చేయబడి జైలులో వేయబడ్డాడు. అతని సంఘంలో ప్రసంగించమని ప్రభుత్వం వేరొక వ్యక్తిని నియమించారు. సంఘం మాత్రం అతణ్ణి ఎన్నుకోలేదు.

అందువల్ల Hristo తన సంఘంలో ప్రసంగించాడు. అందువల్ల అతడు అరెస్టు చేయబడ్డాడు. అతని విషయంలో జరిగిన విచారణ న్యాయాన్ని అవహేళన చేసింది. అతనికి 8 నెలల జైలుశిక్ష విధించ బడింది. అతడు చెరసాలలో ఉన్నప్పుడు క్రీస్తును ప్రతీ విధమైన మార్గంలోనూ ప్రకటించాడు.

ఆయన జైలు నుంచి విడుదలైనప్పుడు ఇలా రాశాడు, “జైలులో ఉన్న నేరస్థులూ, అధికారులూ కూడా చాలా ప్రశ్నలు అడిగేవారు. సంఘంలో మనం ఆశించిన పరిచర్య కంటే ఎక్కువ ఫలవంతమైన పరిచర్య అక్కడ జరిగింది.” మనం స్వేచ్ఛగా ఉన్నప్పటి కంటే చెరసాలలో ఉన్నప్పుడు దేవునికి ఎక్కువగా శ్రేష్ఠంగా పరిచర్య చేస్తాం.[12]

దేవుని మార్గం తరచూ ఇలాగే ఉంటుంది. కరోనా వైరస్ ప్రపంచవ్యాప్తంగా ఎంతో తీవ్రమైన ప్రభావాన్ని కనపరుస్తుండగా, దేవుడు ఈ అవకాశాన్ని వృధా చేసుకోడు. లోకానికి సువార్త అందించాలనే అతని గొప్ప సంకల్పానికి ఈ పరిస్థితి చక్కగా ఉపయోగపడుతుంది. క్రీస్తు తన రక్తాన్ని వ్యర్థంగా చిందించలేదు. “ఆయన వధింపబడినవాడై తన రక్తమిచ్చి ప్రతి వంశములోను ఆయా భాషలు మాటలాడువారిలోను ప్రతి ప్రజలోను ప్రతి జనములోను దేవుని కొరకు మనుష్యులను కొన్నాడు” అని ప్రకటన 5:9 చెబుతోంది. తన శ్రమకు తగిన ఫలితాన్ని ఆయన పొందుతాడు.గ్రేట్ కమీషన్ (మహా ఆజ్ఞ) ను నెరవేర్చడానికి చివరికి ఈ అంటువ్యాధులు కూడా పనికొస్తాయి.

# ముగింపు ప్రార్థన

తండ్రీ, నీ కృపనుబట్టి మా శ్రేష్ఠమైన ఘడియల్లో గేత్సెమనేలో మేము నిద్రపోవడం లేదు. మేము మెలకువగానే ఉండి, మీ కుమారుని ప్రార్థన వింటున్నాము. తాను శ్రమ అనుభవించాలని ఆయనకు తెలుసు. "సాధ్యమైతే ఈ గిన్నె తొలగించుము" అని పరిపూర్ణ మానవత్వంలో ఉన్న ఆయన మీకు మొరపెట్టాడు.

అదే విధంగా ఈ అంటువ్యాధిని మంచిదైన, అత్యవసరమైన ఉద్దేశాల నిమిత్తం మీ జ్ఞానంతో మీరే నియమించాలని మా అంతరంగాల్లో మేము గ్రహిస్తున్నాం. మేము కూడా శ్రమ అనుభవించాలి. మీ కుమారుడు నిర్దోషి, మేము కాదు.

అసంపూర్ణమైన మానవత్వంలో ఉన్న మేము కూడా ఆయనతో పాటే "సాధ్యమైతే ఈ గిన్నెను తొలగించండి" అని మొరపెడుతున్నాము. ఓ ప్రభువా, మీరు చేయాలని తీర్మానించుకున్న బాధాకరమైన, న్యాయమైన, కృపాసహితమైన కార్యాన్ని త్వరగా చేయండి. తీర్పునే కొనసాగించండి. మీ కనికరాన్ని ఆలస్యం చేయకండి. ఓ ప్రభువా, మీ కనికరాన్నిబట్టి పేదవారిని జ్ఞాపకం చేసుకోండి. శ్రమనొందినవారి మొరను మర్చిపోకండి. మేలుకోవడానికి సహాయం చేయండి. చికిత్సను అనుగ్రహించండి. ఈ దుఃఖాల నుంచి పేదలం, నిస్సహాయులం అయిన నీ ప్రజలమైన మమ్మును విడిపించమని మేము ప్రార్థన చేస్తున్నాము.

అయితే ఓ ప్రభువా, మా దుస్థితినీ, దుఃఖాన్నీ వ్యర్థం చేయకండి. బీడుబారిన ఇహలోక తత్వంతో క్రీస్తు రహిత ఆనందంతో నిండిపోయిన నీ ప్రజలను పవిత్రపరచండి. సాతానుగాడు వేసే ఎరకు మా నోళ్ళు చాచకుండా సహాయం చేయండి. మాలో నుంచి అహంకారంతో ద్వేషంతో, అన్యాయంతో కూడిన మార్గాలను ఛేదించండి. మీ మహిమను తూలనాడే, తృణీకరించే మా వైఖరిని తీవ్రంగా సరిచేసుకునే సామర్థ్యాన్ని అనుగ్రహించండి. క్రీస్తు యొక్క సాహచర్యాన్ని చూసి ఆస్వాదించేందుకు మా హృదయ నేత్రాలు తెరవండి. మా హృదయాలను మీ వాక్యం వైపు, మీ కుమారుని వైపు, మీ మార్గం వైపు తిప్పండి. కనికరంతో కూడిన సాహసంతో మమ్మల్ని నింపండి. మీ ప్రజలు చేసే సేవ ద్వారా మీ నామాన్ని ఘనపరచు కోండి.

నశిస్తున్న ఈ లోకాన్ని మేల్కొపడానికి మీ హస్తాలను చాపండి. "అయినను వాళ్ళు మారుమనస్సు పొందలేదు" అనే ప్రకటన గ్రంథం లోని భయంకరమైన మాటలు ఈ తరం గురించి మాట్లాడకుండా ఉండేలా చేయండి. దేహాలను మొత్తినట్లే నిద్రమత్తులో జోగుతున్న ఆత్మలను ఇప్పుడు మొత్తండి. అహంకారం, అవిశ్వాసం అనే అంధ కారంలో వాళ్ళు నిద్రించడాన్ని నిషేధించండి. మీ గొప్ప కనికరాన్ని బట్టి ఈ ఎముకలతో "జీవించండి" అని చెప్పండి. యేసు యొక్క అనంతమైన విలువకు అనుగుణంగా లక్షలాది హృదయాలను, జీవితాలను మలచండి.

యేసు నామంలో ప్రార్థిస్తున్నాను, ఆమేన్.

# Notes


1. "1918 Pandemic (H1N1 Virus)," updated March 20, 2019, centers for Disease Control and Preven tion, http://www.cdc.gov/flu/pandemic-resources/1918-pandemic-h 1n 1.html.
2. Henry Martyn, *Journals and Letters of Henry Martyn* (New York: Protestant Episcopal Society, 1861), 460.
3. Martyn, *Journals and Letters,* 210.
4. John Lennon, "Imagine," produced by John Lennon, Yoko Ono, and Phil Spector, Abbey Road, London, 1971.
5. C. S. Lewis, "The weight of Glory," in *The Weight of Glory and Other Address* (1949; repr., New York: Harper, 2009), 26.
6. Rodney Stark, *The Triumph of Christianity: How the Jesus Movement Became the World's Largest Religion* (New York: Harper, 2011), 113.
7. Stark, *Triumph of Christianity*, 115.
8. Stark, *Triumph of Christianity,* 112.
9. Stark, *Triumph of Christianity,* 116.
10. Stark, *Triumph of Christianity,* 117.
11. Stephen Neill, *A History of Christian Missions,* 2nd ed. (New York: Penguin, 1986), 37-38.
12. Herbert Schlossberg, *Called to Suffer, Called to Triumph* (Portland, OR: Multnomah, 1990), 230.

# లేఖన సూచిక


*ఆదికాండము*

1:31...........................66

3:1-19 .......................65

50:20 ....................... 50

*నిర్గమకాండము*

4:11...........................43

8:1-15.......................43

8:16-19.....................43

8:20-32.....................43

10:1-20.....................43

16:6-8.......................43

*సంఖ్యాకాండము*

20:12.........................30

*ద్వితీయోపదేశకాండము*

32:39.........................45

*యెహోషువ*

10:12-13...................43

*1సమూయేలు*

2:2.............................37

*2సమూయేలు*

22:31............................21

*యోబు*

1:1................................73

1:12........................50.69

1:21..............................44

1:22..............................44

2:6................................69

12:13............................48

36:32............................43

42:2..............................42

*కీర్తనలు*

16:11............................93

19:1..............................25

19:9......................20,104

19:10............................21

31:19............................35

33:10............................43

33:11............................21

34:8..............................26

34:18-19......................27

40:5............................61
63:3............................93
94:19 ..........................27
105:16.........................43
119:89 ........................27
119:103 ......................26
119:152......................20
119:160 .....................27
135:6 .........................42
147:5....................21,48
147:8 .........................43
147:16 .......................43

సామెతలు

3:5...............................59
21:1.............................43
28:26...........................59
30:5.............................27

యెషయా

2:22.............................60
8:12-13.......................30
28:29...........................21
46:9-10 ......................41

యిర్మీయా

1:12.............................42
15:16...........................21

విలాపవాక్యములు

3:32-33...........................40

దానియేలు

2:21................................43
4:35................................42

యోనా

2:10................................43
4:6..................................43
4:7..................................43

మత్తయి

4:23................................43
5......................................96
5:11-12...........................96
5:13-14...........................96
5:16................................95
7:24................................20
8:15................................43
10:29..............................43
10:29-31.........................52
10:37..............................86
13:13..............................23
15:14..............................23
16:18............................107
22:37..............................86

24:7............................78
24:8............................78
24:14 ........................107
24:44...........................80
25:31-32 ....................78

మార్కు

1:11............................32
7:37............................43
9:7..............................32
13:33-37....................80

లూకా

5:24-25......................43
8:25............................43
12:56-57.....................64
13:1-5 ........................82
13:3............................84
13:5............................84
13:16...........................69
14:13-14 ....................97
18:42...........................43
21:34...........................78
22:31....................50,69

యోహాను

1:14...............................25
5:24...............................76
6:68...............................81
8:44...............................69
10:35...................... 20,36
12:31.............................69
14:31.............................32

అపొస్తలుల కార్యములు

1:8................................106
1:11...............................77
4:27-28..........................44
5:19...............................43
7:60..............................106
8....................................97
8:1-4............................106
10:38.............................69
12:23.............................74
17:25.............................35

రోమా

1:18...............................75
1:19...............................25
1:21...............................25
1:22-23..........................87

1:23............................37
1:27............................75
3:23 ...........................37
4:20............................36
5:3-5 .........................62
5:9............................103
5:12............................65
5:16 ...........................67
8:1.........................68,76
8:20-22 .....................66
8:20............................67
8:21............................67
8:21-24 .....................79
8:22............................78
8:23 ...........................68
8:28-30......................52
8:32............................48
8:35-37 .....................50
8:38-39......................50
11:33....................48,62

**1కొరింథీ**

10:31..........................99
15:10..........................90
15:55..........................68

**2కొరింథీ**

1:8-9...............................89
4:4...............................21,69
6:10.............................21,39
12:7-9.............................91
12:7.............................50,69
12:9.............................91,92
12:15..............................15

**గలతీ**

6:10................................99

**ఎఫెసీ**

1:5.................................67
1:7.................................67
1:8-9..........................50,68
1:11.............................43,59
1:18................................68
2:2.................................69
2:3.................................37
2:4-5...............................44
3:4.................................60
3:9.................................48

*ఫిలిప్పీ:*
1:20........................92,99
1:21............................68
1:23 ............................68
3:8...............................93
3:21 ............................79

*కొలస్సీ*
1:13............................32

*1థెస్స*
5:4-10.........................81
5:9-10 ........................12
5:9...............................68
5:15 ............................99
5:21............................64

*2తిమోతి*
2:13............................33
3:16 ............................26

*తీతు*
2:14............................99

*హెబ్రీ*
12:6 ................................76

*యాకోబు*
4:13-15......................17,43
4:15................................43

*1పేతురు*
1:24-25..........................20
2:12................................97
2:24................................98
4:17-18..........................74
4:19................................98

*2పేతురు*
1:21................................27

*1యోహాను*
4:1...................................64.

*ప్రకటన*
5:9.................................108
21:4................................67

ప్రతీ ఒక్కరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. ఆ సంతోషాన్ని పంచడం కోసమే మా వెబ్‌సైట్ ఉనికిలోకి వచ్చింది. మనం దేవునిలో ఎంతగా తృప్తి పొందితే దేవుడు మనలో అంతగా మహిమ పొందుతాడు. ఈ సత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ అర్థం చేసుకోవాలనీ, హత్తుకోవాలనీ మా ఆశ. జాన్ పైపర్ గారు 30 సంవత్సరాలకు పైగానే చేసిన ప్రసంగాలనూ, రచనలనూ మేము సేకరించాము. 40కి పైగా ఇతర భాషల్లోనికి చేయబడిన అనువాదాల కూడా ఈ సేకరణలో ఉన్నాయి. ఎన్నడూ అంతం కాని సత్యాన్నీ, సంకల్పాన్నీ, సంతృప్తినీ కనుగొనడానికి మీరు సహాయపడే నూతనమైన ఆడియో, వీడియోలనూ, రచనలనూ ప్రతీరోజూ మేము అందుబాటులోకి తెస్తున్నాము. ఇవన్నీ ఉచితమే. ఈ పరిచర్య ద్వారా దీవించబడిన ప్రజల దాతృత్వాన్నిబట్టి వారికి కృతజ్ఞతలు.

నిజమైన సంతోషం కోసం మరిన్ని వనరులు మీరు కోరితే, Desiring God లో మా పరిచర్య గురించి మరింత తెలుసు కోవాలనుకుంటే Desiring God వెబ్‌సైట్‌లో మమ్మల్ని సంప్రదించ డానికి మిమ్మల్ని అహ్వానిస్తున్నాము.

*లోకం ఎంత బలహీనమైనదో గుర్తించిన సమయం ఇది. బలమైన పునాదులుగా కనబడేవన్నీ వణుకుతున్నాయి. ఈ సందర్భంలో “మన కాళ్ళ క్రింద ఉన్నది ఎన్నడూ కదిలించబడని బండా? కాదా?” అనే ప్రశ్నను మనం అడగాలి.*

**జాన్ పైపర్**

2020 జనవరి 11వ తేదీన చైనాలోని ఊహాన్ ప్రాంతంలో నోవల్ కరోనా వైరస్ (కోవిడ్-19) తొలిసారిగా ఒక వ్యక్తిని బలిగొందని సమాచారం. 2020 మార్చి 11 వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా అంటు వ్యాధిగా కోవిడ్-19 ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ భయాందోళనల మధ్యలో “దేవుడేం చేస్తున్నాడు?” అనే ప్రశ్న అడగడం సహజం.

“కరోనా వైరస్ మరియు క్రీస్తు” అనే ఈ పుస్తకం ద్వారా ప్రపంచంతటా ఉన్న పాఠకులను స్థిరమైన బండ అయిన యేసుక్రీస్తుపై నిలబడాలని జాన్ పైపర్ ఆహ్వానిస్తున్నారు. సార్వభౌముడైన దేవుడు యేసుక్రీస్తు ద్వారానే మన ఆత్మలను పోషిస్తున్నాడు. తనయందు విశ్వాసముంచే వారి యెడల తన జ్ఞానయుక్తమైన సత్సంకల్పాలను నెరవేర్చడానికి ఈ సార్వభౌముడైన దేవుడే సమస్తాన్ని నియమిస్తున్నాడు, పరిపాలిస్తున్నాడు. ఈ కరోనా వైరస్ ద్వారా దేవుడేం చేస్తున్నాడు? ఈ ప్రశ్నకు బైబిల్ నుంచి 6 జవాబులు చెబుతూ, ప్రస్తుత సమయంలో కూడా దేవుడు పనిచేస్తూనే ఉన్నాడని పైపర్ చూపిస్తున్నాడు.

**జాన్ పైపర్** గారు Desiring God.org కు స్థాపకుడు, ముఖ్యమైన బోధకుడు. బెత్లేహేమ్ కాలేజ్ సెమినరీకి ఛాన్సలర్. మిన్నేసోటా లోని మినియాపొలిస్‌లో బెత్లేహేమ్ బాప్టిస్ట్ చర్చ్‌కు పైపర్ 33 సంవత్సరాలు సీనియర్ పాస్టర్‌గా సేవలందించారు. ఈయన 50కి పైగా పుస్తకాలను రచించారు. ఆ 50 పుస్తకాల్లో *Desiring God, Don't Waste Your Life, Reading the Bible Supernaturally* అనేవి కూడా ఉన్నాయి.

EB
ekklesia books
Bible-centered Resources for Local Churches
www.ekklesiabooks.com